Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్టులుగా ఎదిగే గొప్ప సదావకాశం..

The Largest Circulated Telugu Fortnightly

కేంద్ర, రాష్ట ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను • బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు ఆర్‌సి ఇన్‌చార్జిలు •మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 256 | హైదరాబాద్ | శుక్రవారం 31 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR



## అనిశ్చితి వేళ అత్యయిక భేటీ

భారత్‌పై పశ్చిమాసియా పరిణామాలను విశ్లేషించిన ప్రధాని మోదీ

భద్రతపై కేబినెట్ కమిటీ సమావేశంలో మోదీ సమీక్ష

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో మళ్లీ రోజురోజుకూ ప్రతికూల పరిస్థితులు ఎదురవుతుండటంతో అక్కడి విపరిణామాలు భారత్‌పై ఏమేరకు ప్రభావం చూపుతున్నాయనే విషయమై ప్రధాని మోదీ కీలక సమీక్ష జరిపారు. కీలక శాఖల మంత్రులు, ఉన్నతాధికారులను పలు అంశాలపై ప్రధాని ఆరా తీశారు. తన అధ్యక్షతన గురువారం ఢిల్లీలో జరిగిన భద్రతపై కేబినెట్ కమిటీ(సీసీఎస్) అత్యవసర సమావేశంలో ప్రధాని మోదీ ఇంధన అవసరాల కోసం కొనసాగుతున్న

- మిగతా 2వ పేజీలో



# కాంగ్రెస్ 'గో' రాజకీయం!

హిందుత్వ ఓట్లకు గాలం వేసే యోచనలో అధికార పార్టీ

- రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో త్వరలోనే గోరక్షణ కమిషన్ ఏర్పాటు
- గోవుల పరిరక్షణ, విరాళాల సేకరణ, గోశాలల పర్యవేక్షణ, ఫిర్యాదులపై కమిషన్‌దే తుది నిర్ణయం?
- ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసిన సీఎం రేవంత్
- బతుకమ్మ మాదిరిగా ఏకకాలంలో రాష్ట్రవ్యాప్తంగా గోపూజ.. ఏటా గోమాత దినోత్సవం!... రాష్ట్రంలోని 258 గోశాలలూ స్వయం మనుగడ సాగించేలా ప్రణాళిక
- సంఘ్‌తో సంబంధం లేని హిందుత్వ ఓట్లు ఆకర్షించడమే ఎజెండా

హైదరాబాద్: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ గోవుల చుట్టూ రాజకీయం దిశగా పావులు కదుపుతోంది. హిందుత్వ ఓట్లు గంపగుత్తగా బీజేపీ ఖాతాలో పడకుండా సంఘ్‌తో సంబంధం లేని ఓటు బ్యాంకును తన వైపునకు తిప్పుకునే ప్రయత్నాలను అసెంబ్లీ ఎన్నికలకు రెండున్నరేళ్ల ముందు నుంచే మొదలుపెట్టింది. ఇందులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే గోవులను కేంద్రంగా చేసుకొని కీలక నిర్ణయం ప్రకటించే యోచనలో

- మిగతా 2వ పేజీలో



భారాస నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి

# కన్నుమూత

హైదరాబాద్: భారాస నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గురువారం అర్ధరాత్రి 12.50 గంటలకు కన్నుమూశారు. ఈ మేరకు సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ఈ నెల 26న ఉదయం హనుమకొండలో ఆయనకు ఛాతీలో నొప్పి రావటంతో స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు కార్డియాక్ అరెస్ట్‌గా గుర్తించారు. గంట సేపు శ్రమించి తొమ్మిదిసార్లు సీపీఆర్ చేశాక.. కొంత ఫలితం కనిపించడంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స ఆరంభించారు. సుదీర్ఘకాలం స్పృహలో లేకపోవడం వల్ల ఆయనలో నాడీ సంబంధిత స్పందన కనిపించలేదని వైద్యులు

- మిగతా 2వ పేజీలో



## లీకేజీ బిల్లుకు రాజ్యసభ ఆమోదం

వాకౌట్ చేసిన ప్రతిపక్షాలు..

మూజువాణి ఓటుతో ఆమోద ముద్ర

ఇప్పటికే లోక్‌సభలో బిల్లుకు గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: పేపర్ లీకేజీలను అరికట్టడానికి, దోషులకు కఠిన శిక్ష విధించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు--2026' రాజ్యసభలో ఆమోదం పొందింది. బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లును కేంద్ర సహాయం మంత్రి జితేంద్ర సింగ్ గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దీనిపై సభలో

- మిగతా 2వ పేజీలో



## కూరగాయల సాగును ప్రోత్సహించండి

రైతులకు 75% సబ్సిడీతో విత్తనాలు.. సీఎం రేవంత్

సెంట్రలైజ్డ్ కిచెన్ల చుట్టూ ఆర్గానిక్ వ్యవసాయానికి ప్రోత్సాహం

రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలి

ఎల్ నినోపై నివేదికను సీఎంకు అందజేసిన నిపుణుల కమిటీ

హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు కూరగాయలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. వ్యవసాయ శాఖతోపాటు ఇతర అనుబంధ శాఖలు సమన్వయంతో

## మెండుగా వానలు.. నిండుగా ప్రాజెక్టులు!

-2లో

జూరాల నుంచి శ్రీశైలం వైపు పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

కృష్ణా, గోదావరి పరవళ్లు

కృష్ణా పరీవాహకంలో ఆల్మట్టి నుంచి జూరాల వరకు గేట్లు ఎత్తివేత...

శ్రీరాంసాగర్‌కు భారీ ప్రవాహం.. పోటెత్తిన కడెం, ప్రాణహిత, ఇంద్రావతి

కడెం గేట్లు ఎత్తివేత.. ఎల్లంపల్లి, మేడిగడ్డ, సమ్మక్క సీతమ్మసాగర్‌కు భారీ వరద.. నేడు భద్రాచలం వద్ద 10 లక్షల క్యూసెక్కులకు చేరనున్న






## పేపర్ లీక్‌కు అక్కడే బీజం!

ప్రశ్నపత్రాల రూపకల్పన, అనువాదంలో ఒకే వ్యక్తులు

ప్రశ్నల నిధి పేరిట తుది ప్రశ్నలు అమ్మకం

మనీషా వాఘ్మారే ద్వారా చేతుల మారిన నీట్ ప్రశ్నపత్రం

దర్యాప్తులో గుర్తించిన సీబీఐ

న్యూఢిల్లీ: నీట్--యూజీ పేపర్ లీకేజీ కేసులో సీబీఐ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ప్రశ్నపత్రాల రూపకల్పన, అనువాదంలో ఒకే బృందంలోని వ్యక్తులు పాలుపంచుకోవడం నీట్ పేపర్ లీకేజీకి గల కారణాల్లో ఒకటని సీబీఐ వర్గాలు తెలిపాయి. ఈ లోపాలను

- మిగతా 2వ పేజీలో



-2లో

## లోక్‌సభలో మళ్లీ రగడ

విద్యార్థులపై పోలీసుల దాష్టీకం,

విరాళాల చోరీపై విపక్షాల ఆందోళన

హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని విపక్షాల పట్టు

'వందేమాతరం' బిల్లుకు ఆమోదం

# రాజకీయాల్లోకి రంగనాథ్!

ఖద్దరు వేసుకోనున్న హైడ్రా కమిషనర్

పాలిటిక్స్‌లోకి తీసుకురావాలని సీఎం ప్లాన్

ఖమ్మం.. నల్లగొండ జిల్లాల నుంచి..

ఎమ్మెల్యే లేదా ఎంపీగా పోటీకి సిద్ధం

రాజకీయ మలుపు తీసుకోనున్న ఐపీఎస్ కెరీర్

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఖాకీ దుస్తులు వదిలి ఖద్దరు దుస్తులు ధరించేందుకు సిద్ధమవుతున్నారు. హైడ్రా కమిషనర్‌గా కేసులు ఎదుర్కొంటున్న ఆయన అదే హైడ్రా కమిషనర్‌గా మాస్ ఇమేజ్ కూడా సంపాదించుకున్నారు. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రంగనాథ్‌ను తప్పించక తప్పని పరిస్థితులు వస్తే, ఆయనను రాజకీయాల్లోకి తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నట్లు సమాచారం. రంగనాథ్ కు ఐపీఎస్ హోదాలో ఉన్నంత కాలం కోర్టు కేసులు, డిపార్ట్‌మెంటల్ నోటీసులు వెంటాడుతాయి. వీఆర్‌ఎస్ ఇచ్చి గవర్నర్ కోటాలో లేదా ఖాళీ అయ్యే ఎమ్మెల్సీ స్థానాలలో, ఎన్నికలు జరిగే ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్ట భద్రుల స్థానంలో శాసనమండలికి పంపాలని యోచిస్తున్నట్లు సమాచారం.



### డీఎస్పీగా మొదలై..

హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్పీగా 1996 బ్యాచ్‌తో కెరీర్ ప్రారంభించి, 2006లో ఐపీఎస్ సాధించిన రంగనాథ్.. టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల కాలంలో ఎల్లప్పుడూ కీలక పోస్టింగ్‌లకే ప్రాధాన్యమిచ్చారు. కేసీఆర్ పాలనలో నల్లగొండ ఎస్పీగా అమృత-ప్రణయ్ కేసు దర్యాప్తు, హైదరాబాద్ జాయింట్ సీపీగా 'ఆపరేషన్ రోప్', వరంగల్ సీపీగా మెడికో ప్రీతి కేసుల సమయంలో అప్పటి ప్రభుత్వ అజెండాను క్షేత్రస్థాయిలో వేగంగా అమలు చేశారనే ముద్ర ఉంది. ఇక హైడ్రా కమిషనర్‌గా

- మిగతా 2వ పేజీలో

# కాంగ్రెస్ 'గో' రాజకీయం!

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నట్లు తెలుస్తోంది. రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో గోరక్షణ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించిన సీఎం.. ఇప్పటికే అధికారులకు ఆదేశాలు కూడా జారీ చేశారని.. త్వరలోనే ఉత్తర్వులు వెలువడతాయనే చర్చ ప్రభుత్వ వర్గాల్లో జరుగుతోంది. కమిషన్ ఏర్పాటుతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో గోమాత పూజ చేయాలని, ఈ కార్యక్రమానికి బతుకమ్మ తరహా ప్రాచుర్యం కల్పించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. అలాగే గోమాత దినోత్సవం నిర్వహించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలియవచ్చి?చంది. తద్వారా గోజాతి సంరక్షణతోపాటు హిందుత్వ ప్రభావం ఉన్న ఓటర్లను ఆకర్షించే వ్యూహాన్ని అమలు చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనగా కనిపిస్తోంది.

### బోర్డు కావాలని అడిగితే..

వాస్తవానికి గత నెలలో రాష్ట్రంలోని గోశాలల నిర్వాహకులతో పశుసంవర్ధక శాఖ సమావేశమైంది. ఈ సమావేశంలో భాగంగా రాష్ట్రంలోని 200కుపైగా గోశాలల నిర్వాహకులు తమ సాదకబాధలను ప్రభుత్వం ముందు పెట్టారు. గోసరంక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని పశుసంవర్ధక శాఖ అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఏకంగా కమిషన్ ఏర్పాటు చేద్దామని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించడం గమనార్హం. ఈ నేపథ్యంలోనే బాలల సంక్షేమ కమిషన్ తరహాలోనే గోరక్షణ కమిషన్‌కు అధికారాలు కట్టబెట్టనున్నట్లు తెలుస్తోంది. గోవుల సంరక్షణతోపాటు అన్ని గోశాలలపై పర్యవేక్షణ, గోశాలలకు విరాళాల విషయంలో పారదర్శకత, గోవధ, ఇతర అంశాల్లో ఫిర్యాదులపై కమిషన్ తుది నిర్ణయం తీసుకొనేలా మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో ఏర్పాటు కానున్న ఈ కమిషన్‌లో పశుగణాభివృద్ధి, విజయా డెయిరీ, వెటర్నరీ యూనివర్సిటీ, గోశాలల నిర్వాహకులు, పశుసంవర్ధక శాఖ అధికారులను సభ్యులుగా నియమించనున్నట్లు సమాచారం.

### గోశాలలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి..

ఇప్పటికే రాష్ట్రంలోని మొయినాబాద్, యాదాద్రి, వేములవాడల్లో భారీ గోశాలలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వంద ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న మొయినాబాద్ గోశాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలు సిద్ధమయ్యాయి. ఇక రాష్ట్రంలోని 258 గోశాలలకు రిజి?రస్టేషన్ తప్పనిసరి చేయడమే కాకుండా ఆయా గోశాలలు సొంతంగా మనుగడ సాగించేలా ఆర్థిక పరపతి కల్పించే దిశలో కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం. ఇక బతుకమ్మ పూజ తరహాలోనే గోమాత పూజను కూడా ఏకకాలంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం తరఫున గిన్నిస్ రికార్డు సాధించేందుకు పశుగణాభివృద్ధి సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ సంస్థ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా 1,500 మంది గోపాలమిత్రలు పనిచేస్తున్నారు. వారు ప్రాతినిధ్యం వహించే ప్రాంతాల్లో ఏకకాలంలో గోవులను సమీకరించి వాటికి పూజ చేయబోతున్నామని తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ సింగం చరణ్ కౌశిక్ యాదవ్ 'సాక్షి'కి తెలిపారు. అలాగే ఏటా సెపట?టంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవం పేరిట బీజేపీ చేసే హడావుడికి కూడా గోవుతోనే చెక్ పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆ రోజును గోమాత దినోత్సవంగా ప్రకటించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

### ఫలితమిస్తున్న విరుగుడు

బీజేపీని కౌంటర్ చేసేందుకు కొన్ని రాజకీయ వ్యూహాలు ఫలితాన్ని ఇస్తున్నాయని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. ముఖ్యంగా 2020 ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీని ఎదుర్కొనేందుకు ఆ పార్టీ నేత కేజ్రీవాల్ ఓ టీవీ ఇంటర్వ్యూలో హనుమాన్ చాలీసా పఠించారు. ఆ తర్వాత కన్నాట్‌ప్లేస్‌లోని ఓ హనుమాన్ దేవాలయాన్ని దర్శించుకున్నారు. బీజేపీకి పడాల్సిన హిందుత్వ ఓట్లకు గండి కొట్టేందుకు ఈ పరిణామం ఓ కారణమనే విశ్లేషణలు అప్పట్లో వచ్చాయి. అలాగే 2016లో జీహెచ్‌ఎంసీ ఎన్నికల కంటే కొన్ని వారాల ముందు తన ఫాంహౌస్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయుత చండీ మహాయాగం నిర్వహించారు. అంగరంగ వైభవంగా ఈ యాగాన్ని నిర్వహించడం ద్వారా ఆయన తనలోని హిందుత్వవాదాన్ని బహిరంగంగా తెలియజేశారు. ఈ నేపథ్యంలో తాము హిందూ వ్యతిరేకులం కాదని బహిరంగ పర్చడం ద్వారా బీజేపీకి అనుబంధంగా లేని హిందుత్వ ఓట్లను ఆకర్షించవచ్చని కాంగ్రెస్ కూడా అంచనా వేస్తోంది.

## భారాస నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఆక్సిజన్ లోపం కారణంగా మెదడుకు నష్టం జరిగినట్లు ఈసీజీ, బ్రెయిన్ ఎంఆర్ఐ, టీసీడీ పరీక్షల్లో సూచనలు కనిపించాయని పేర్కొన్నారు. 5 రోజుల అనంతరం ఆయన గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు.

### సామాన్య కుటుంబం నుంచి..

1974 ఆగస్టు 6న ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మండల కేంద్రం నల్లబెల్లిలో రైతు కుటుంబంలో జన్మించిన సుదర్శన్‌రెడ్డి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఆయన 2018లో నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలుత కాంగ్రెస్‌లో ఉన్న ఆయన.. 2001లో తెరాస (ప్రస్తుత భారాస)లో చేరి అదే ఏడాది నల్లబెల్లి జడ్పీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. తెరాస ప్రభుత్వంలో 2015 పౌర సరఫరాల సంస్థ రాష్ట్ర ఛైర్మన్‌గా పనిచేసి 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

## రాజకీయాల్లోకి రంగనాథ్!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన సంచలనాలకు తెరతీశారు. ఈ క్రమంలోనే ఆయనపై కోర్టుల్లో కేసులు నమోదు అయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డికి ఖమ్మం, నల్లగొండ జిల్లా నేతల నుంచే తలనొప్పి ఉంది ఆయా జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని బలం ఉన్నప్పటికీ అక్కడ హేమాహేమీలైన సీనియర్ నేతలైన మంత్రులు ఉన్నారు. ఈ నేపథ్యంలో సొంత సామాజిక వర్గం, మాస్ ఇమేజ్ ఉన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను చట్ట సభలకు పంపడం ద్వారా ఆయా జిల్లాల కాంగ్రెస్ రాజకీయాలపై సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా నమ్మకమైన నేత లభిస్తారు. సీనియర్ల గ్రూపు రాజకీయాలకు ఇది ప్రత్యక్ష రివర్స్ చెక్ విధాన ప్రక్రియ అవుతుంది. లేదంటే.. హైడ్రా కమిషనర్‌గా నగరంలోని చెరువులు కాపాడిన 'నిజాయితీ గల అధికారి'గా అర్బన్ ఓటర్లలో వచ్చిన క్రేజ్‌ను కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ మున్సిపల్ ఎన్నికల్లో తమకు అనుకూలంగా మార్చుకోవచ్చు. లేదంటే ఆయన బాల్యం, ప్రాథమిక విద్య సాగించిన హుజూర్‌నగర్ లేదా మిర్యాలగూడ కనుక ఉమ్మడి నల్గొండ సొంత జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గాల నుంచి శాసనసభకు పోటీ చేసే రహస్య ప్రతిపాదన ఒకటి ఉన్నట్లు సమాచారం. పార్లమెంట్ బరిలో ఐపీఎస్ హోదా ఉన్న వ్యక్తికి పార్లమెంట్ ఎన్నికలు సరిగ్గా సరిపోతాయి. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం ఎంపీ స్థానాలతో పాటు హైదరాబాద్ పరిధిలోని మల్కాజ్‌గిరి లేదా సికింద్రాబాద్ లాంటి హై-ప్రొఫైల్ ఎంపీ స్థానాల నుంచి ఆయనను బరిలోకి దింపే అవకాశం ఉంది. ఏదైమైనా ఖాకీ డ్రెస్సులో వ్యవస్థలను పరుగులు పెట్టించి, హైకోర్టు ఆగ్రహంతో వివాదాల నిలయంగా మారిన ఏ.వి. రంగనాథ్ ఐపీఎస్ కెరీర్ ఇప్పుడు ఒక కీలక రాజకీయ మలుపు తిరగనునున్నట్లు తెలుస్తుంది. పదవీ విరమణకు ఇంకా కొంత సమయం ఉన్నప్పటికీ, ఈ వివాదాలను అధిగమించేందుకు వీఆర్ఎస్ తీసుకుని రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహం కోసం ఖాకీ చొక్కా వదిలి.. ఖద్దరు చొక్కా తొడుక్కుంటారా...? లేక మున్సిపల్ కార్పొరేషన్, అసెంబ్లీ, పార్లమెంట్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నేరుగా ప్రజాక్షేత్రంలోకి దూకుతారా అనేది తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ఉత్కంఠ రేపుతున్న ప్రశ్న.

## అనిశ్చితి వేళ అత్యయిక భేటీ

(మొదటి పేజీ తరువాయి)

దిగుమతుల తీరుతెన్నులు, అవలంభిస్తున్న అంతర్జాతీయ విధానాలను సమీక్షించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్, హోం మంత్రి అమిత్‌షా, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా, వాణిజ్య మంత్రి పియూష్ గోయల్, షిప్పింగ్ మంత్రి శర్బానంద సోనోవాల్, పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్ పురితోపాటు ఆయా శాఖల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. హోర్ముజ్ జలసంధి, నల్ల సముద్ర, ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ మార్గాల ద్వారా పెట్రోలియం, సహజవాయువు, ఎరువుల దిగుమతి తీరుతెన్నులపై కేబినెట్ కార్యదర్శి టీవీ సోమనాథన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతర్జాతీయంగా నెలకొన్ని అనిశ్చితి, భద్రతపై దాని దుష్ప్రభావాలు, దేశీయంగా ద్రవరూప సహజ వాయువు, ఎల్పీజీ, పెట్రోల్, డీజిల్, పెట్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు భారత్ ఆ మేరకు తీసుకుంటున్న చర్యలను అధికారులు ప్రధానికి విడమర్చి చెప్పారు. ఎల్పీజీని విభిన్న దేశాల నుంచి సమీకరిస్తున్నామని, సరిపడా నిల్వలు దేశంలో ఉన్నాయని సోమనాథన్ వెల్లడించారు. రైతులుకు ఎల్లవేళలా ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆదేశించారు. హోర్ముజ్ జలసంధి, సమీప సముద్ర జలాల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే సరకు రవాణా నౌకల్లోని భారతీయ నావికులు, సిబ్బంది రక్షణపై మోదీ ఆరాతీశారు. భారతీయ సిబ్బంది యోగక్షేమాలను భారత్‌లోని వాళ్ల కుటుంబసభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేసే యంత్రాంగాన్ని ఏర్పాటుచేయాలని మోదీ సూచించారు.

## పేపర్ లీక్‌కు అక్కడే బీజం!

(మొదటి పేజీ తరువాయి)

అనధికారికంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కి తెలియజేశామని, తమ అధికారిక సిఫార్సుల్లో కూడా ఈ అంశాన్ని చేర్చే అవకాశం ఉందని వెల్లడించాయి. నీట్--యూజీ 2026 అవకతవకలు 2024 నాటి అక్రమాలకు పూర్తిగా భిన్నమైనవి పేర్కొన్నాయి. 2024లో ఒక పరీక్ష కేంద్రం ఇన్‌చార్జ్ పేపర్ లీక్ ముఠాతో కుమ్మక్కై ప్రశ్నపత్రాల దొంగతనానికి, వ్యాప్తికి సహకరించాడని దర్యాప్తులో పాల్గొన్న అధికారులు తెలిపారు. 2024 నాటి కేసులో దర్యాప్తు అనంతరం ప్రశ్నపత్రాల రవాణా, నిర్వహణ, పరీక్షకు సంబంధించిన వ్యవస్థాగత మార్పులపై సీబీఐ ఎన్‌టీఏకు పలు సూచనలు చేసిందని తెలియజేశారు. ఈ సూచనలను 2025, 2026లో నీట్ నిర్వహణలో ఎన్‌టీఏ అమలు చేసిందని, అందువల్ల సాంకేతికంగా ఎటువంటి 'లీక్' జరగలేదని చెప్పారు. 2026లో ఎన్‌టీఏ ప్యానెల్‌లోని ప్రశ్నపత్రాల రూపకర్తలు, వాటిని మరాఠీ భాషలోకి అనువాదం చేసిన పి వి.కుల్కార్ణి(కెమిస్ట్రీ), మనీషా గురునాథ్ మంధారే(ఫిజిక్స్), మనీషా సంజయ్ హవల్దార్(బయాలజీ) పుణెలో తమ ట్యూషన్ తరగతుల్లోని విద్యార్థులతో తుది ప్రశ్నలను కంఠస్థం చేయించారని సీబీఐ అధికారులు తెలిపారు. ఆ ప్రశ్నలతో ఒక ప్రశ్నల నిధిని తయారుచేసి, ఎంపిక చేసిన విద్యార్థులకు ఇచ్చారని చెప్పారు.

## లోక్‌సభలో మళ్లీ రగడ

న్యూఢిల్లీ: గత రెండ్రోజులుగా కాస్తంత ప్రశాంత వాతావరణం కన్పించిన పార్లమెంట్‌లో గురువారం మళ్లీ విపక్షాల నిరసనహోరు మొదలైంది. చలో సంసద్ ర్యాలీ సందర్భంగా విద్యార్థులపై పోలీసుల కర్కశ చర్య, అయోధ్య రామాలయ విరాళాల చోరీ ఆరోపణలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభలో నిరసన వ్యక్తం చేయడంతో సభా కార్యక్రమాలు దాదాపు స్తంభించాయి. పలుమార్లు వాయిదాలు పడ్డ సభలో తీవ్ర గందరగోళం మధ్యే ప్రభుత్వం జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) (వందేమాతరం) బిల్లును ఆమోదించింది. బుధవారం ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమైన వెంటనే కాంగ్రెస్ సహా ఇండియా కూటమికి చెందిన ఎంపీలు తమ స్థానాల్లో నిలబడి నినాదాలు చేశారు. విద్యార్థులపై జరిగిన పోలీసు అతి చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో ప్రకటన చేయాలని, ఆ అంశంపై వెంటనే చర్చకు అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అయోధ్య రామాలయంలో కోట్ల కొలదీ విరాళాలు చోరీ అయిన ఉదంతంపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని సమాజ్‌వాదీ పార్టీ సహా విపక్ష పార్టీల సభ్యులు పట్టుబట్టాయి. దీంతో సభ ప్రారంభమైన కొద్దిసేపటికే స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమయ్యాక వివిధ శాఖలకు సంబంధించిన మంత్రులు పార్లమెంటరీ పత్రాలు సభ ముందుంచిన తర్వాత విపక్ష సభ్యులు తిరిగి నినాదాలు కొనసాగించారు. దీంతో సభను 3:30 గంటల వరకు వాయిదా వేశారు.

అయోధ్య రామాలయంలో భారీ స్థాయిలో విరాళాలు చోరీకి గురైన ఘటనపై మకరద్వారం ముందు సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఒక విరాళాల పెట్టెను ఏర్పాటు చేసి అందులో కరెన్సీ నోట్లను విరాళమిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

## కూరగాయల సాగును ప్రోత్సహించండి

(మొదటి పేజీ తరువాయి)

పనిచేసి రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలని సూచించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను భారీ సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ల పరిసర ప్రాంతాల్లో కూరగాయల ఆర్గానిక్ పద్ధతిలో సాగును ప్రోత్సహించాలని, అక్క డ పండే తాజా కూరగాయలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేసి కిచెన్లకు సరఫరా చేసే వ్యవస్థను అభివృద్ధి చేయా లని సూచించారు. దీంతో రైతులకు గిట్టు బాటు ధర లభించడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన, తాజా ఆహారం అందుబాటులోకి వస్తుందన్నారు. గురువారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ముఖ్యమంత్రికి ఎల్‌నినో పరిస్థితుల ప్రభావం, వ్యవసాయంపై దాని ప్రభావం, తీసుకోవాల్సిన అత్యవసర చర్యలపై డాక్టర్ చిన్నారెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన నిపుణుల కమిటీ నివేదికను సమరి?పంచింది. ఈ సందర్భంగా కమిటీ చేసిన సిఫార్సులపై సీఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైతుల ఆదాయానికి భరోసా కలి?పంచడంతోపాటు ఆహార భద్రతను కాపాడే విధంగా కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

### గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళిక

ప్రతి గ్రామానికి ప్రత్యేక అత్యవసర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కమిటీ సూచించింది. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో 32 లక్షల ఎకరాల్లో వరి, సాగు తగ్గిందని, అందుకు ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను ప్రోత్సహించాలని కమిటీ తన నివేదికలో పేర్కొంది. ఆయా ప్రాంతాల భూస్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులను బట్టి పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని పేర్కొంది. పంటలకు అవసరమైన విత్తనాలను 75% సబ్సిడీపై అందించడంతో పాటు, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే రైతులకు కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని సిఫార్సు చేసింది. హైదరాబాద్ పరిసర గ్రామాల్లో కూరగాయల సాగును ప్రత్యేకంగా ప్రోత్సహించాల ని పేర్కొంది. నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమీకృత కూరగాయల ఉత్పత్తి కేంద్రాలను అభివృద్ధి చేయాలని తెలిపింది.

### పశుగ్రాసం, డెయిరీపై దృష్టి

వ్యవసాయంతోపాటు పశుసంవర్ధక రంగాన్ని కూడా బలోపేతం చేయాలని కమిటీ సూచించింది. పశుగ్రాస విత్తనాలను సబ్సిడీపై అందించి పశుగ్రాస సాగును పెంచాలని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త డెయిరీ యూనిట్ల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించాలని సిఫార్సు చేసింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సూచనలు అందించాలని, ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల నిర్వహణపై ప్రత్యేక సలహాలు ఇవ్వాలని సూచించింది. ఆయా బృందాలు పంటల పరిస్థితి, నీటి లభ్యత, రైతుల సమస్యలను నిరంతరం పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు అందించాలని పేర్కొంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి, నిపుణుల కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### రూ.803 కోట్లతో కార్యాచరణ

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, సాగునీరు తదితర రంగాలకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రాష్ట్ర నిపుణుల కమిటీ ప్రభుత్వానికి సమర్పించింది. ఈ ప్రణాళిక అమలుకు సుమారు రూ.802.92 కోట్ల నిధులు అవసరమని కమిటీ అంచనా వేసింది. సీఎంకు నివేదిక సమర్పించిన అనంతరం జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నష్టాన్ని తగ్గించడం, నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలకు నివేదికలో ప్రాధాన్యం ఇచి?చనట్లు తెలిపారు. జలాశయాల్లో నీటి నిల్వలు, భూగర్భ జలమట్టం తగ్గడంతో నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలను గ్రామాల వారీ కార్యాచరణతో ప్రోత్సహించాలన్నారు.

## మెండుగా వానలు.. నిండుగా ప్రాజెక్టులు!

హైదరాబాద్ /గద్వాల/మంచిర్యాలరూరల్: బిరబిరా కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది..గలగలా గోదావరి పరుగులు పెడుతోంది. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో ఎడతెరపి లేని వర్షాలతో కృష్ణా, గోదావరి నదులు వరదెత్తాయి. శ్రీశైలం ప్రాజెక్టు వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. దీంతో ప్రాజెక్టుకు వరద ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. గురువారం ఉదయం 6 గంటలకు జలాశయానికి 30,194 క్యూసెక్కుల వరద రాగా, సాయంత్రం 6 గంటల వరకు 89,240 క్యూసెక్కులకు పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు గరిష్ట నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 827.26 అడుగులకు చేరగా నిల్వలు 46.82 టీఎంసీలకు పెరిగాయి. ప్రాజెక్టు నిండాలంటే మరో 168 టీఎంసీల నీరు అవసరం. పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కొనసాగుతుండటంతో కృష్ణా ప్రధాన పాయ నుంచి కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలోకి వరద ప్రవాహం పెరిగింది. ఆల్మట్టి డ్యామ్‌లోకి 82,111 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, 1.1లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలుతున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 1.1 లక్షల క్యూసెక్కుల నీరు చేరుతుండగా, 1.11 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలోని ఉజ్జయినీ జలాశయానికి 33,803 క్యూసెక్కుల వరద వస్తుండగా, 31,600 క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. దీంతో పైమూడు జలాశయాలకు దిగువన తెలంగాణలో ఉన్న జూరాల ప్రాజెక్టుకు 94,733 క్యూసెక్కుల వరద పోటెత్తింది. ప్రాజెక్టు గరిష్ట నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా, 7.66 టీఎంసీల నీటిని నిల్వ చేస్తూ 85,421 క్యూసెక్కుల నీటిని 12 గేట్లు, విద్యుత్ కేంద్రం ద్వారా దిగువ వదులుతున్నారు. ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో నిలకడక వరద కొనసాగుతోంది. కర్ణాటకలోని తుంగభద్ర డ్యామ్‌లోకి 14,922 క్యూసెక్కుల నీరు చేరుతుండగా..గరిష్ట నిల్వ సామర్థ్యం 105.79 టీఎంసీలకుగాను 36.04 టీఎంసీలకు నిల్వలు చేరాయి. జూరాల నుంచి విడుదల చేస్తున్న వరద శ్రీశైలం ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండడంతో నిల్వలు క్రమంగా పెరుగుతున్నాయి. దిగువన ఉన్న నాగార్జునసాగర్ గరిష్ట నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా ప్రస్తుతం 136.99 టీఎంసీల నిల్వలున్నాయి.

### ఎగువ గోదావరిలో....

మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో ఎగువ గోదావరిలో క్రమంగా వరద పెరుగుతోంది. దిగువ పరీవాహకంలోని ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తారం వర్షాలు కురుస్తుండడంతో వాగులు, వంకల్లో వరద ఉధృతమవుతోంది. గోదావరిపై మహారాష్ట్రలో ఉన్న జైక్వాడి ప్రాజెక్టులోకి 33,328 క్యూసెక్కుల వరద చేరుతుండడంతో గరిష్ట సామర్థ్యం 102.73 టీఎంసీలకు గాను 79.79 టీఎంసీలకు నిల్వలు పెరిగాయి. ఉపనది సింగూరులో వరద ప్రారంభం కాకపోవడంతో రాష్ట్రంలోని సింగూరు, నిజాంసాగర్ ప్రాజెక్టులకు ఇంకా వరద ప్రారంభం కాలేదు. ఎగువ గోదావరిపై ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 75,432 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో 80.5 టీఎంసీల గరిష్ట సామర్థ్యానికి గానూ 21.51 టీఎంసీలకు నిల్వలు చేరాయి. మరో ఉపనది కడెంపై ఉన్న కడెం ప్రాజెక్టుకు 1.44 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో 4.7 టీఎంసీల గరిష్ట సామర్థ్యానికి గాను 1.91 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ 16 గేట్లు ఎత్తడం ద్వారా 1.48 లక్షల క్యూసెక్కుల నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కడెం నుంచి 1.56 లక్షల క్యూసెక్కులు, గోదావరి నుంచి 2.07 లక్షల క్యూసెక్కులు కలిపి మొత్తం 3.63 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో 20.18 టీఎంసీల గరిష్ట నిల్వ సామరాథ్యనికి గాను 19.09 టీఎంసీల నిల్వలను కొనసాగిస్తూ నంది పంప్‌హౌస్ ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని మిడ్‌మానేరుకు తరలిస్తున్నారు. ప్రాజెక్ట్‌లోని 62 గేట్లలో 15 గేట్లు ఎత్తి 1.57 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.గోదావరి--ప్రాణహిత నదుల సంగమ స్థలం వద్ద నిర్మించిన మేడిగడ్డ బరాజ్‌లోకి ప్రాణహిత నుంచి 2.12 లక్షల క్యూసెక్కుల వరద రాగా, వచ్చిన వరదను వచ్చినట్టు కిందకు విడుదల చేస్తున్నారు. ప్రాణహితకు ఇంద్రావతి ప్రవాహం తోడు కావడంతో దిగువన ఉన్న సమ్మక్క బరాజ్‌కు 8.05 లక్షల క్యూసెక్కుల వరద పోటెత్తడంతో వచ్చిన వరదను వచ్చినట్టు కిందకు విడుదల చేస్తున్నారు.

## లీకేజీ' బిల్లుకు రాజ్యసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

సుదీర్ఘంగా చర్చ జరిగింది. బిల్లును వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు వాకౌట్ చేయగా, మూజువాణి ఓటుతో బిల్లుపై ఆమోదముద్ర వేశారు. ఉభయ సభల ఆమోదం పొందడంతో బిల్లు ఇక రాష్ట్రపతి వద్దకు వెళ్లనుంది. రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారనుంది. పరీక్షల్లో అక్రమాలు, ప్రశ్నపత్రాల లీకేజీలను సహించే ప్రసక్తే లేదని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ తేల్చిచెప్పారు. నిజాయతీగా కష్టపడి చదివే విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందులో భాగంగానే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు రాజ్యసభలో ప్రకటించారు. ఈ బిల్లు 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం--2024కు కొనసాగింపు అని ఆయన చెప్పారు. పరీక్షల్లో అక్రమాలను అరికట్టడానికి దేశంలోనే మొట్టమొదటిగా 2024లో చట్టం తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు.

ప్రస్తుత సవరణ ఒక ముందడుగు అని అభివర్ణించారు. పరీక్షల వ్యవస్థలో మెరిట్, పారదర్శకత, విశ్వసనీయతకు పెద్దపీట వేస్తూ విద్యార్థులు, యువత ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. 2024 నాటి చట్టాన్ని మరింత కఠినతరం, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో, ఇటీవలి అనుభవాలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సవరణలను తీసుకొచ్చినట్లు జితేంద్ర సింగ్ తెలియజేశారు. పరీక్షల్లో సంస్కరణలపై నిర్మాణాత్మక సూచనలను స్వీకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు.

### యువతను శాంతింపజేయడానికే బిల్లు: ఖర్గే



నీట్ పేపర్ లీక్‌పై ఆందోళనకు దిగిన విద్యార్థులపై పోలీసుల దమనకాండకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షానే బాధ్యుడని రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రజలు ఏదో ఒకరోజు ఆయనకు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. పేపర్ లీక్ నిరోధక బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చలో ఖర్గే మాట్లాడారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా సభకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. పేపర్ లీక్‌పై వారిద్దరూ ఎందుకు నోరుమెదపడం లేదని నిలదీశారు. విద్యార్థులపై లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగానికి ఎవరు ఆదేశాలు ఇచ్చారు, విద్యార్థులను కొడుతున్న సాధారణ దుస్తుల్లోని వ్యక్తులు ఎవరు అనే ప్రశ్నలకు హోంమంత్రి సమాధానం చెప్పలేకపోతే, రాజీనామా చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు.

ప్రశ్నపత్రాల లీకేజీని ఎలా అరికడతారో చెప్పకుండా కేవలం యువతను శాంతింపజేయడానికే ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చిందని విమర్శించారు. అధిక జరిమానాలు, కఠినమైన శిక్షలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల వంటి చర్యలు ఎలాంటి మార్పు తీసుకురావని తేల్చిచెప్పారు. పరీక్షలను నిర్వహించే సంస్థలు, పరీక్షల విధానంలో సమగ్ర సంస్కరణలు చేపట్టకపోతే పేపర్ లీకేజీలు జరుగుతూనే ఉంటాయని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి పదవి నుంచి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చినందుకు యువతకు ఖర్గే అభినందనలు తెలియజేశారు. యువత పోరాటం, పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనల కారణంగానే ప్రభుత్వం చివరికి తలవంచిందని అన్నారు.

# కరీంనగర్‌లో లోకల్ బస్సులు ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

(తాండ్ర శరత్ రావు ప్రజాతీర్పు బ్యూరో కరీంనగర్) జూలై 30



నగర ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా సదుపాయం అందించే లక్ష్యంతో డా.బి.ఆర్. బస్ స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యేలు కరీంనగర్ బస్ స్టేషన్ నుండి వాగేశ్వరి కాలేజీ వరకు సిటీ బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కొలగాని శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. మొదటి దశలో కరీంనగర్ -- వాగేశ్వరి కాలేజీ, కరీంనగర్ -- చింతకుంట, కరీంనగర్ -- కొత్తపల్లి హవేలీ అనే మూడు రూట్లలో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు నడవనున్నాయి. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కరీంనగర్ పట్టణంలో చాలా కాలంగా డిమాండ్‌లో ఉన్న సిటీ బస్సు సర్వీసులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని, ఈ బస్సులు విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, మహిళలకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉపాధి నిమిత్తం కరీంనగర్‌కు వచ్చే చింతకుంట, ఓద్యారం, కొత్తపల్లి ప్రాంతాల ప్రజలకు, అలాగే విద్యా సంస్థలకు నిలయమైన వాగేశ్వరి వైపు ఈ సర్వీసులు నడుపుతామని మంత్రి తెలిపారు. మెడికల్ కాలేజీలు ఉన్న ప్రతిమ, చల్మెడ, మానకొండూరు వైపు కూడా బస్సులు నడుపుతామని, ప్రయాణికుల నుండి ఆదరణ లభిస్తే 24 గంటలు బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవసరమైతే ఒకే రూట్‌లో అదనపు బస్సులు నడిపేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామనినగర ప్రజలంతా సిటీ బస్సులను వినియోగించుకోవాలని మంత్రి కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రూట్లలో బస్సులు నడుపుతున్నామని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారని మంత్రి వివరించారు. కొత్త బస్సుల కొనుగోలు, కొత్త నియామకాలు చేపట్టడంతో పాటు ఉద్యోగుల పెండింగ్ బకాయిలను కూడా చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామానికి బస్సు సదుపాయం చేరాలన్నదే తమ ధ్యేయమని, ఆర్టీసీ ప్రతిరోజూ 35 లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తూ 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.



## ప్రస్తుత వర్ష పరిస్థితులలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 30

ప్రస్తుతం కురుస్తున్న వర్ష పరిస్థితులలో ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటి గోడ కూలిన ఘటనలో గాయాలై చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, ఆర్.ఎం.ఓ. లు భీష్మ, శ్రీధర్, కోటపల్లి మండల తహసిల్దార్ రాఘవేంద్ర లతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కోటపల్లి మండలం ఆలుగాం గ్రామానికి చెందిన ఆత్రం మాంతయ్య ఇంటి గోడ కూలి ఇంటిలో ఉన్న ఆత్రం లక్ష్మి తలకు, ఆత్రం అనిల్ చేతికి గాయాలై మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. బాధితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని, పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుత వర్ష పరిస్థితులలో ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూర్, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్లకు తీసుకోవలసిన చర్యలపై ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజా సంరక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## భౌతికకాయానికి నివాళులు అర్పించిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) జులై 30

టేకులపల్లి: మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈది గణేష్ సోదరి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న లిఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులుకోరం కనకయ్య ఇల్లందులోని వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్--ఉమా టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కినేని శ్యామ్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని భౌతికకాయానికి నివాళులర్పించారు.

## ఎన్నికల హామీలు వెంటనే నెరవేర్చాలి

- బీజేవైఎం నేతలు నేరెడ్ల ప్రవీణ్ రెడ్డి, సంగ నరేష్

( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 30



కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక తెలంగాణ చౌక్ వద్ద భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేరెడ్ల ప్రవీణ్ రెడ్డి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు సంగ నరేష్ పాల్గొని ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని విమర్శించారు. నిరుద్యోగ భృతిని రెండున్నర ఏళ్లుగా ఇవ్వకుండా నిరుద్యోగ సమాజాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, మెగా డీఎస్సీ ఇస్తామని నమ్మించి,నేడు ప్రకటించిన పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ అంశంలో కూడా నిరుద్యోగులను తీవ్రంగా మోసం చేసిందన్నారు. నిరుద్యోగుల ఆశలను కాంగ్రెస్ వమ్ము చేసిందని , తూ తూ మంత్రంగా నోటిఫికేషన్లు విడుదల చేస్తూ నిరుద్యోగుల జీవితాలతో కాంగ్రెస్ సర్కార్ చెలగాటమడుతుందని ఘాటుగా విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ప్రతి నిరుద్యోగికి న్యాయం జరిగేలా వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల ఆశలతో ఆడుకుంటున్న ప్రభుత్వ వైఖరి మారకపోతే, రాబోయే రోజుల్లో యువతను ఏకం చేసి రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం ,జిల్లా ప్రధాన కార్యధర్శి ఎడవెల్లి శశిధర్ రెడ్డి,నక్క ప్రమోద్,గుర్రం వెంకటేష్ గౌడ్,చిక్కుల కిరణ్ గడ్డం అరుణ్ మణిదీప్ రాహుల్ రెడ్డి జాగిరి రాజేందర్ లతోపాటు బీజేవైఎం నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## వర్షాల నేపథ్యంలో అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- సిరిసిల్ల కలెక్టర్ గారిమా అగ్రవాల్

సిరిసిల్ల, జులై 30 (ప్రజాతీర్పు ప్రతినిధి)



ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్‌డబీ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అధికారులు తమ పరిధిలోని ప్రాంతాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, భవనాలు, రహదారులు, లో లెవెల్ కల్వర్టులు తదితర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని తెలిపారు. లో లెవెల్ కల్వర్టులు, వాగులు, వంతెనలు, రహదారులపై నీటి ప్రవాహాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, ప్రజలు ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ లేదా పంట నష్టం సంభవిస్తే వెంటనే జిల్లా యంత్రాంగానికి సమాచారం అందించి, పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, జీపీఓలు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. చెరువులు, కుంటలు, వంతెనలు, కాలువలు, లోతట్టు ప్రాంతాల వద్ద నీటి ప్రవాహ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని జలాశయాల పరిస్థితులు, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో తదితర వివరాలను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

### కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో వరదలు, నష్టాల వివరాలపై సమాచారం అందించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్ 9398684240 ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.



## ఎల్లంపల్లి, కాళేశ్వరం తేడా తెలియని మూర్ఖులు బీఆర్ఎస్ నాయకులు

- మంత్రి మహేందర్

రామడుగు/గంగాధర, జూలై 30 (ప్రజాతీర్పు ప్రతినిధి)

ఎల్లంపల్లి ప్రాజెక్టు, కాళేశ్వరం ప్రాజెక్టు మధ్య తేడా కూడా తెలియకుండా బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంత్రి మహేందర్ ఆరోపించారు. గురువారం గంగాధర ప్రజా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొండగట్టు ఆంజనేయస్వామి ఆశీర్వాదంతో తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని, రైతులు పాడిపంటలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చేపట్టిన కొండగట్టు గిరి ప్రదక్షిణ సంకల్పానికి ఆంజన్న కరుణించి వర్షాలు కురిపించారని పేర్కొన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 2004 జూలై 28న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేశారని, తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా విద్యుత్ ఖర్చు లేకుండా నీటిని తరలించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభానికి ముందే 2016 అక్టోబర్ 19న ఎల్లంపల్లి నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించారని, 2019లో కాళేశ్వరం ప్రారంభమయ్యేలోపు ఆరుసార్లు నీటి విడుదల జరిగిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వేల కోట్ల రూపాయల వ్యయంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, భారీ విద్యుత్ ఖర్చుతో నీటిని ఎత్తిపోసే పరిస్థితి తీసుకొచ్చిందని విమర్శించారు. ప్రాజెక్టు పిల్లర్లు దెబ్బతినడంతో నీటిని పూర్తిస్థాయిలో నిల్వ చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరుతుండటంతో అక్కడి నుంచి వరద కాలువకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు లేకపోయినా ఎల్లంపల్లి నుంచి వరద కాలువకు నీటిని తరలించే అవకాశం ఉందని, ఈ విషయాలపై కనీస అవగాహన లేకుండా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం వారి అజ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నారాయణపూర్ రిజర్వాయర్‌తో పాటు వరద కాలువకు జనవరిలోనే సాగునీరు విడుదల చేసిన ఘనత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు దక్కుతుందని అన్నారు. చొప్పదండి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలు దూరమవుతారనే భయంతోనే బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చన్న, మహిళా కాంగ్రెస్ నాయకురాలు చిరుత మంగ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, పలువురు సర్పంచ్‌లు, కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాలక్ష్మితో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.
- వేములవాడ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు మంత్రులు, ప్రభుత్వ విప్ శంకుస్థాపన.

(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) జూలై 30:



మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పక్కాగా అమలు చేస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం వేములవాడ--కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. మహిళల ఉచిత ప్రయాణంతో ఆర్టీసీలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. కొత్త బస్సులు కొనుగోలు చేయడంతో పాటు సిబ్బంది నియామకాలు కూడా చేపడుతున్నామని వెల్లడించారు. 1984లో నిర్మించిన వేములవాడ బస్‌స్టేషన్‌ను రూ.1.62 కోట్ల వ్యయంతో ఆధునీకరిస్తున్నామని చెప్పారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు రోజూ సుమారు 250 బస్సులు, 560 ట్రిప్పులు నడుస్తున్నాయని పేర్కొన్నారు. కోరుట్ల మీదుగా బాసరకు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సును ప్రారంభించామని, గతంలో ముంబైకి కూడా బస్సు సౌకర్యం కల్పించామని గుర్తు చేశారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీని లాభాల బాట పట్టించామని, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు.రోజుకు 50 వేల మంది వేములవాడ బస్ స్టేషన్ నుంచి ప్రయాణం చేస్తున్నారని వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 334.11 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేసి రూ. 11,668 కోట్లు ఆదా చేసుకున్నారని వెల్లడించారు. 2600 కొత్త బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 100 కోట్లతో బస్ స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నామని, ఆర్టీసీ ఉద్యోగుల దాదాపు రూ.1000 కోట్ల పీఎఫ్ బకాయిలు, 600 కోట్ల సీసీఎస్ బకాయిలు చెల్లించామని వెల్లడించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని అన్నారు. దేశంలోనే అతిపెద్ద ప్రజారవాణా సంస్థగా తెలంగాణ ఆర్టీసీ మహిళలకు ఉచిత ప్రయాణాన్ని విజయవంతంగా అందిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వరుణ పూజలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఇటీవల కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుని రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అదే అభివృద్ధి దిశగా వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ... వేములవాడ తిప్పాపూర్ బస్‌స్టేషన్ ఆధునీకరణకు రూ.1.62 కోట్లు మంజూరు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నియోజకవర్గ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చే లక్షలాది మంది భక్తులు, ప్రయాణికులకు ఈ ఆధునీకరించిన బస్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. గతంలో పలుమార్లు కూలిపోయిన బస్‌స్టేషన్ సమీప వంతెనను భూ నిర్వాసితులకు న్యాయం చేసి పూర్తి చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రూ.249.40 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, సంజయ్ కుమార్, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల గుమ్మం వద్దకే సంక్షేమ ఫలాలు చేరవేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం : రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

- చంద్రుగొండ మండలంలో రూ.1.25 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- పూరి గుడిసెలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతాం
- రాష్ట్రవ్యాప్తంగా 7 లక్షల ఇందిరమ్మ గృహాల నిర్మాణం చేపట్టాం



**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు) జులై 30**

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో విస్తృతంగా పర్యటించి 1.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మంత్రి ముందుగా మంగయ్య బంజార గ్రామంలో రూ.45 లక్షల వ్యయంతో మంగయ్య బంజారు--గానుగపాడు రహదారిపై గ్రావెల్ రోడ్డు, కల్వర్టు నిర్మాణం, ఇల్లంగి బాబు ఇంటి నుండి కాజ్‌వే వరకు సీసీ రోడ్డు, కాజ్‌వే నుండి గానుగపాడు రహదారి వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి 24 ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసినట్లు ప్రకటించారు. అనంతరం పోకలగూడెం గ్రామంలో రూ.60 లక్షల వ్యయంతో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. యాసం లక్ష్మి ఇంటి నుండి మలిశెట్టి జానకమ్మ, కందికొండ కుమారి ఇంటి వరకు, బానోతు నరసింహ ఇంటి నుండి ఇస్లావత్ రాందాస్, గుగులోతు మంగిత్య ఇంటి వరకు, ఆర్ అండ్ బి రోడ్డు నుండి పెండయ్య ఇంటి మీదుగా పద్దం రాముడు ఇంటి వరకు, గోపు చంద్రయ్య ఇంటి నుండి వాటర్ ట్యాంక్ వరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. గ్రామానికి ఇప్పటికే 77 ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. గ్రామంలో మిగిలిన అంతర్గత రహదారుల అభివృద్ధికి కూడా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తదుపరి రావికంపాడు గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో రాచర్ల వెంకటేశ్వర్లు ఇంటి నుండి యూపీ పాఠశాల వరకు, అనుముల ముత్తయ్య ఇంటి నుండి శ్రీరాములు రామారావు ఇంటి వరకు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా పాలన సాగిస్తోందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.8.21 లక్షల కోట్ల అప్పులతో వదిలి వెళ్లినప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి, ఇటీవల మరో 16 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మహిళల ఆర్థిక సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ స్వయం సహాయక సంఘాలకు రూ.70 వేల కోట్ల వడ్డీలేని రుణాలను మంజూరు చేశామని, మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు పేదలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తున్నామని, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, రైతు సంక్షేమ కార్యక్రమాలు, సామాజిక భద్రతా పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ గృహాల పథకం కింద తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల గృహాలు, రెండో విడతలో మరో 2.50 లక్షల గృహాలు మంజూరు చేసి మొత్తం 7 లక్షల ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని చేపట్టామని మంత్రి తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్రత్యేకంగా లక్ష ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఒక్క పేద కుటుంబం కూడా పూరి గుడిసెలో నివసించకుండా ప్రతి అర్హ కుటుంబానికి శాశ్వత గృహాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అంతర్గత రహదారులు, కల్వర్టులు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చంద్రుగొండ మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజల జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుత, గత స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మంగయ్య బంజార గ్రామం మొదటగా ఏకగ్రీవంగా ఎంపిక అయ్యిందని తెలిపారు. అప్పటి నుంచి గ్రామంలో మౌలిక వసతుల కల్పన, సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు, గృహ నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవతో చంద్రుగొండ మండలానికి పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు మంజూరవుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని పనులను కూడా చేపడతామని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ,చంద్రుగొండ మండలంలో ఇందిరమ్మ గృహాల కోసం పూరి గుడిసెల సర్వే పూర్తయిందని తెలిపారు. అర్హుల గుర్తింపు ప్రక్రియ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా కొనసాగుతోందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి శుక్రవారం "ఫ్రైడే--డ్రై డే" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపడుతున్నామని తెలిపారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడం, దోమల నివారణ, తాగునీటి పరిశుభ్రత, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పనకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తాసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, పంచాయతీ అధికారి అనూష, గృహ నిర్మాణ శాఖ పిడి,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## భారీ వర్షాల నేపథ్యంలో రాంనగర్ బ్రిడ్జిని పరిశీలించిన పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ప్రమాదాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 30**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, మంచిర్యాల జోన్ బెల్లంపల్లి పట్టణంలోని 27వ,33వ వార్డుల మధ్య ఉన్న రాంనగర్ బ్రిడ్జిపై వరద నీరు ఉప్పొంగి ప్రవహిస్తున్న పరిస్థితిని గురువారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహం, భద్రతా ఏర్పాట్లు, ప్రజల రాకపోకల పరిస్థితిని సమీక్షించి,పోలీసు,రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు అవసరమైన సూచనలు చేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ,భారీ వర్షాల కారణంగా ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు,కాలువలు, బ్రిడ్జిలను ఎట్టి పరిస్థితుల్లో నూ దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు,బ్యారికేడ్లను గౌరవిస్తూ పోలీసు, రెవెన్యూ,మున్సిపల్ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, చిన్నారులను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనివ్వకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు ఈ పరిశీలనలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్,దావ స్వాతి రమేష్,మున్సిపల్ కమిషనర్,తన్నీర్ రమేష్ తహసీల్దార్ కృష్ణ ,27వ, 33వ వార్డుల కౌన్సిలర్లు,బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్,ఇతర ఎస్ఐ,లు,పోలీసు సిబ్బంది,మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## విద్యుత్ ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రవీణ్ రావు ప్రత్యేక చొరవ

- 50వ డివిజన్‌లో ప్రమాదకర చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం

**(శరత్ రావు బ్యూరో, కరీంనగర్, ప్రజా తీర్పు) జూలై 30**

వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు తలెత్తకుండా 50వ డివిజన్ కార్పొరేటర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో విద్యుత్ తీగలు, స్తంభాలకు ప్రమాదకరంగా మారిన చెట్లను, కొమ్మలను తొలగించే బృహత్తర కార్యక్రమాన్ని ప్రవీణ్ రావు చేపట్టారు. ఈ పనులను స్వయంగా పరిశీలించి, మున్సిపల్ సిబ్బందికి తగిన సూచనలు అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ, ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడి షార్ట్ సర్క్యూట్లు జరిగే ప్రమాదం ఉన్న ప్రాంతాలను డివిజన్‌లో గుర్తించడం జరిగిందని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ వల్ల డివిజన్ ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డివిజన్‌లోని పలు ప్రాంతాలలో విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో ప్రమాదకర చెట్ల కొమ్మలను తొలగించినట్లు చెప్పారు. డివిజన్‌లో విద్యుత్ సరఫరాకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉన్నా, లేదా ప్రమాదకరంగా మారిన చెట్లు ఎక్కడైనా ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ప్రజల సౌకర్యార్థం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని బోయిన్‌పల్లి ప్రవీణ్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానిక బిజెపి నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.



## జాతికుంట చెరువును సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి

**(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 30**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శాసనసభ్యులు,గడ్డం వినోద్ వెంకటస్వామి, ఆదేశాల మేరకు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రడగంబాల బస్తీలోని జాతికుంట చెరువును సందర్శించి అక్కడి పరిస్థితిని క్షేత్ర స్థాయిలో పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి దావ స్వాతి రమేష్ బాబు, మరియు వార్డ్ కౌన్సిలర్ శ్రీమతి.కంకటి ప్రణిత-శ్రీనివాస్.. ఈ సందర్భంగా జాతికుంట చెరువులో భారీ వర్షం కారణంగా వరద నీరు భారీగా చేరడంతో పూడిక మూసుకుపోయి వరద నీరు నిండి పరిసర ప్రాంత ప్రజల ఇళ్ళలోకి చేరే ప్రమాదం పొంచి ఉన్నందున మున్సిపల్ సిబ్బందిచే చెరువుకు మరొకవైపు గండి కొట్టి నీరును మళ్ళించడం జరిగిందన్నారు..భారీ వర్షాల నేపథ్యంలో జాతికుంట చెరువు పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ ప్రజలకు సూచించారు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంకటి శ్రీనివాస్, రూరల్ సీఐ శ్రీ హనోక్, 2 టౌన్ ఎస్ఐ తిరుపతి, బస్తీ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు..



## మనుబోతులగడ్డగ్రామంలో నివాస పరిస్థితిపై తక్షణ చర్యలు

**నర్సంపేట రూరల్, జూలై 30, ప్రజా తీర్పు ప్రతినిధి:**

మనుబోతులగడ్డ గ్రామానికి చెందిన భూలక్ష్మి నివాస పరిస్థితిపై వచ్చిన కథనాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లిన అనంతరం, ఖానాపూర్.మండలఅభివృద్ధి అధికార వి. అద్వైత ఈరోజుగ్రామాన్నిసందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీఓ సునీల్ కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ రమ, అంగన్‌వాడీ టీచర్ కవిత, పంచాయతీ కార్యదర్శి శ్రీమతి ప్రమీల పాల్గొన్నారు.గ్రామంలో పరిశీలన నిర్వహించిన అనంతరం, భూలక్ష్మి మరుగుదొడ్డిని నివాసంగా ఉపయోగిస్తున్న విషయాన్ని గుర్తించి, వెంటనే ఆమెను అక్కడి నుండి సురక్షితంగా తరలించి, మరుగుదొడ్డికి తాళం వేయించారు. ఆమె సామగ్రిని గ్రామానికి చెందిన ఆబర్ల రాజన్న ఇంటికి తరలించి, తాత్కాలికంగా అక్కడే నివసించేలా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా రాజన్న కుటుంబం సహకారం అందించేందుకు ముందుకు రావడాన్ని అధికారులు అభినందించారు. అదేవిధంగా, భూలక్ష్మి ఇందిరమ్మ ఇళ్ల ఎల్-1 జాబితాలో ఉన్నందున, రెండో విడతలో ఆమెకు ఇందిరమ్మ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు. భూలక్ష్మి కుమార్తె వీరలక్ష్మి గర్భిణి కావడంతో, ఆమె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గుడ్లు, పాలు, పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని అవగాహన కల్పించారు. అలాగే, ఐసీడీఎస్ సూపర్వైజర్‌కు గర్భిణికి సమయానికి పౌష్టికాహారం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

## ప్రజారవాణా బలోపేతం కోసం సిటీ బస్సుల ప్రారంభం

- రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 30**



కరీంనగర్ నగర ప్రజలకు మరింత మెరుగైన ప్రజా రవాణా సేవలు అందించడానికి నగరంలో సిటీ బస్సులు ప్రారంభిస్తున్నట్టు రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ప్రకటించారు. గురువారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బస్ స్టేషన్ లో సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ సర్వీసులను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. అనంతరం కరీంనగర్ బస్ స్టేషన్ నుండి వాగేశ్వరి కాలేజీ వరకు సిటీ బస్సులో ప్రయాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం , కవ్వంపల్లి సత్యనారాయణ, మేయర్ కొలగాని శ్రీనివాస్ , జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ముఖ్య నేతలు అధికారులు పాల్గొన్నారు. మొదటి దశలో కరీంనగర్ --వాగేశ్వరి కాలేజీ, కరీంనగర్ - చింతకుంట, కరీంనగర్ -- కొత్తపల్లి హవేలీ వరకు మూడు రూట్లలో మూడు సిటీ మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులను నడుపుతారు .ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ పట్టణంలో చాలా కాలంగా డిమాండ్ ఉన్న సిటీ బస్సులను నేడు ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు ,మహిళలకు ఈ బస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉపాధి కొరకు కరీంనగర్ నుండి వచ్చేప్రజలుకు అలాగే చింతకుంట , ఒద్యారం, కొత్తపల్లి ,విద్యా సంస్థలకు నిలయమైన వాగేశ్వరి వైపు ఈ సిటీ బస్సు సర్వీసులు నడిపించడం జరుగుతుందని తెలిపారు. మెడికల్ కాలేజీలు ఉండే ప్రతిమ, చల్మెడ, మానకొండూరు వైపు కూడా బస్సులు నడుపుతామని, ప్రయాణికులు ఆదరిస్తే 24 గంటలు బస్సులు నడిసెల చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

- 12 ఏళ్లగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం

**పటాన్ చేరు, జూలై 30 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



సమాజ సేవ, సుస్థిర అభివృద్ధి పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గురువారం రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లాస్ మేట్ నోట్ బుక్ లు, క్రేయాన్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్టేషనరీ కిట్లతో పాటు భోజనం ప్లేట్లను పంపిణీ చేసింది. చుట్టుపక్కల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యా అవసరాలకు మద్దతుగా, గత 12 సంవత్సరాలుగా గీతం నిరంతరం నిర్వహిస్తున్న సుదీర్ఘకాల అవుట్-రీచ్ కార్యక్రమంలో ఇది ఒక భాగం

ఈ పంపిణీ కార్యక్రమం, 'వ్యర్థాల నుంచి సంపద' (వెల్త్ అవుట్ ఆఫ్ వేస్ట్ - వావ్ ) అనే నినాదంతో గీతం చేపడుతున్న సుస్థిరతా ప్రయత్నం. ఈ కార్యక్రమం ద్వారా, గీతం విద్యార్థులు ఆతిథ్య విభాగం సహకారంతో ప్రాంగణం నుంచి చదివేసిన వార్తాపత్రికలు, పాత రికార్డులు, పుస్తకాలు, ఇతర పునర్వినియోగ కాగితపు సామగ్రిని సేకరిస్తారు. ఈ సామగ్రిని రీసైక్లింగ్ కోసం ఐటీసీ పేపర్ బోర్డ్స్ అండ్ స్పెషాలిటీ పేపర్స్ విభాగానికి అప్పగిస్తారు. ప్రతిఫలంగా, ఐటీసీ క్లాస్ మేట్ విద్యా ఉత్పత్తులను అందిస్తుంది. వీటిని పేద విద్యార్థులకు పంపిణీ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత రెండింటినీ గీతం ప్రోత్సహిస్తోంది. ఈ విద్యా కిట్లను గీతం హైదరాబాద్ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ పీవీ నాగేంద్రకుమార్, గీతం పూర్వ విద్యార్థి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనూజ్ తదితరులు పంపిణీ చేయగా, ఇ-క్లబ్ చైర్మన్ మాధవ్ భాస్కర్, ఇ-క్లబ్ సభ్యులు సహకరించారు. విద్యార్థులు నోట్ బుక్ లు, స్టేషనరీ కిట్లను ఎంతో ఉత్సాహంగా స్వీకరించి, చిరునవ్వులతో, హృదయపూర్వక కృతజ్ఞతతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు గీతం, ఐటీసీ అందిస్తున్న నిరంతర మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంపై శాశ్వత సానుకూల ప్రభావాన్ని సృష్టించే కార్యక్రమాల ద్వారా నాణ్యమైన విద్య, పర్యావరణ సుస్థిరత, అర్థవంతమైన సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి గీతం కట్టుబడి ఉందని చెప్పారు.

# వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా వరుణయాగం ప్రారంభం





- సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని మంత్రులు, ప్రజాప్రతినిధుల ఆకాంక్ష

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జూలై 30**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకళ్యాణార్థం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పిస్తూ మూడు రోజుల పాటు నిర్వహించనున్న వరుణయాగం గురువారం వైభవంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గౌరవ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు గారు, శ్రీ పొన్నం ప్రభాకర్ గారు, శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, గౌరవ ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ గారు, గౌరవ ఎమ్మెల్యేలు శ్రీ కవ్వంపల్లి సత్యనారాయణ గారు, డాక్టర్ సంజయ్ కుమార్ గారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ గౌరవ శ్రీమతి గరిమా అగర్వాల్, ఐఏఎస్ గారు, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ (ఎస్పీ) గౌరవ శ్రీ మహేష్ బి.,గితే గారు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన గౌరవ అతిథులకు ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు అందించగా, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీమతి రమాదేవి గారు స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఎస్పీ గార్లకు అందజేశారు. అనంతరం గౌరవ మంత్రులు, ప్రజాప్రతినిధులు ఆలయ అర్చకులు, వేద పండితులకు వరుణ యాగం ప్రారంభం సందర్భంగా వర్ని సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జూలై 30వ తేదీ నుండి ఆగస్టు 1వ తేదీ వరకు సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు. మొదటి రోజు కార్యక్రమాల్లో స్వస్తి పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణ జపాలు, వరుణయాగ హోమం, సంతత ధారాభిషేకం, జపానుష్ఠానాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా దేవస్థానం పరివార, అనుబంధ ఆలయాల్లో మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు, విరాటపర్వ పారాయణాలు, ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం గౌరవ మంత్రులు, ఎమ్మెల్యేలు యాగశాలలో వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు. భీమేశ్వర సదన్‌లోని ఈశాన్య మూలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా గౌరవ ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ గారు శాలువాలతో గౌరవ మంత్రులను సత్కరించి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గౌరవ మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, వరుణయాగం అనేది కేవలం ఆధ్యాత్మిక క్రతువే కాకుండా లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం ద్వారా చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీరు సమృద్ధిగా లభించి పంటలు బాగా పండుతాయని తెలిపారు. సమృద్ధిగా వర్షాలు కురిస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అవడంతో పాటు రాష్ట్రం వ్యవసాయరంగంలో మరింత అభివృద్ధి సాధిస్తుందని, ప్రజలకు తాగునీటి సమస్యలు తీరడంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా నెలకొంటుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ ఈ వరుణయాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీమతి గరిమా అగర్వాల్, ఐఏఎస్ గారు, గౌరవ జిల్లా ఎస్పీ శ్రీ మహేష్ బి.గితే గారు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీమతి రమాదేవి గారు, జిల్లా అధికారులు, ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థానం అధికారులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.



## రిటైర్డ్ ఎంపీడీవో తౌటు రాంరెడ్డి మృతి బాధాకరం

- మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

**రామడుగు, జూలై 30 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

చిగురుమామిడి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా (ఎంపీడీవో) సేవలందించి పదవీ విరమణ పొందిన తౌటు రాంరెడ్డి మృతి చెందడం అత్యంత బాధాకరమని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం రామడుగు మండలంలోని కొక్కెరకుంట గ్రామంలో రాంరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ, చిగురుమామిడి మండల అభివృద్ధికి రాంరెడ్డి విశేష సేవలు అందించారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా అందించడంలో ఆయన నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. తాను ఎంపీపీగా పనిచేసిన మూడు పర్యాయాల్లో రాంరెడ్డి ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తూ ప్రజాప్రతినిధులు, అధికారులు మధ్య సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఎక్కడ కలిసినా ఆప్యాయంగా పలకరించే సౌమ్య వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా రాంరెడ్డి గుర్తుండిపోతారని పేర్కొన్నారు. ఆయన మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, టేకుమల్ల సమ్మయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు బూడిద సదాశివ పాల్గొన్నారు.



## శివానగర్ లో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం

**పటాన్ చేరు, జూలై 30 (ప్రజాతీర్పు ప్రతినిధి)**

గతంలో శివనగర్ లో తోళ్ల పరిశ్రమకు ఇచ్చిన పట్టాలలో అక్రమంగా నిర్మిస్తున్న ఇండ్లు బ్రతుకమని తోళ్ల పరిశ్రమకు జాగలిస్తే వాటిని చనువు చేసుకొని కమర్షియల్ బిల్డింగ్లు కడుతూ టీఎస్ ఐపాస్ లో పని చేస్తున్న బడా బాబులకు కార్మికులకు కిరాయిలిస్తూ అక్రమంగా పెద్ద పెద్ద బిల్డింగులు నిర్మిస్తున్నారు తక్షణమే యొక్క నిర్మాణాలు ఆపివేయాలని జిన్నారం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది యొక్క కార్యక్రమంలో జిన్నారం మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి జిన్నారం కో ఆప్షన్ మెంబర్ సీనియర్ నాయకులు కురుపల్లి నర్సింగరావు జిన్నారం మండల బిజెపి అధ్యక్షులు కొత్త కాపు జగన్ రెడ్డి కౌన్సిలర్లు కుమార్ స్వప్న రాజేందర్ రెడ్డి శివనగర్ మాజీ వార్డ్ మెంబర్ కమ్మరి కృష్ణ ఆదిత్య యాదవ్ వడ్ల వెంకటేష్ దుబ్బ శ్రీనివాస్ రాజ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఉల్లాసంగా జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

**(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, భూక్య సందీప్, ప్రజాతీర్పు ) జూలై 30**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భద్రాచలం,సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఎదురుగా ఉన్న క్రికెట్ మైదానంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు ఉత్సాహంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలను భద్రాచలం గ్రామ సర్పంచ్ కృష్ణదొర ఒలింపిక్ జెండాను ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది అథ్లెట్లు పాల్గొనడం అభినందనీయమన్నారు. ఇదే ఉత్సాహంతో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు అత్యధిక పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాతాజీ మాట్లాడుతూ, ఈ పోటీల్లో అధిక సంఖ్యలో గిరిజన క్రీడాకారులు పాల్గొనడం ఎంతో ఆనందదాయకమన్నారు, భవిష్యత్తులో వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే సామర్థ్యం కలిగి ఉన్నారని తెలిపారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె. మహీధర్ మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి ఎంపికల్లో ప్రతిభ కనబరిచిన 40 మంది అథ్లెట్లను ఎంపిక చేసి, వచ్చే నెల 7వ తేదీన హనుమకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు జిల్లా తరఫున పంపనున్నట్లు తెలిపారు. అనంతరం క్రికెట్ గ్రౌండ్ నిర్వాహకులు సిద్దారెడ్డి విజేతలకు పతకాలు ప్రదానం చేసి అభినందించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ కన్వీనర్ జి. గిరి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎంపికలను జిల్లా అథ్లెటిక్స్ కోచ్ పి. నాగేంద్ర పర్యవేక్షించగా, అథ్లెటిక్స్ కోచ్‌లు నాగరాజు, మల్లికార్జున్, శ్వేత, విజయ లక్ష్మి మరియు అసోసియేష కోశాధికారి బి హనుమంతరావు నిర్వహించారు.

## టేకులపల్లి లో ఘనంగా ముగిసిన సిఐటియు గేట్ మీటింగ్

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు) జులై 30**



టేకులపల్లి :సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సి.ఐ.టి.యు) ఇల్లందు బ్రాంచ్ కార్యదర్శి ఎం. డీ అబ్బాస్అధ్యక్షతన నేడు కోయగుడెం లో గేట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా కార్మికుల హక్కుల పరిరక్షణ, చట్టబద్ధమైన ప్రయోజనాలు మరియు స్థానిక సింగరేణి సమస్యలపై విస్తృతంగా చర్చించారు. గేట్ మీటింగ్ ముఖ్యాంశాలు కోయాగుడెం ఓపెన్ కాస్ట్ మైన్ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు, జె.బి.సి.సి మెంబర్ కామ్రేడ్ మంద నరసింహారావు ముఖ్య అతిధిగా ప్రసంగించారు.పూసపల్లి సాధన:ఇల్లందు భవిష్యత్తును కాపాడుకోవడానికి పూసపల్లి ఓ సి అత్యంత కీలకమని, దీనికోసం యూనియన్లు, రాజకీయ పార్టీలు, కార్మికులు మరియు పట్టణ ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ తీరుపై ప్రశ్న:డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క డిసైడ్ బ్లాకులను పరిశీలించడానికి వచ్చినప్పటికీ, కార్మికులను గానీ కార్మిక నాయకులను గానీ కలవకుండా వెళ్లడం వెనుక ఉన్న మతలబు ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు.కార్మికులకు న్యాయ పోరాట భరోసాగతంలో అండర్‌గ్రౌండ్ నుండి సర్ఫేస్‌కు వచ్చి జీతాలు నష్టపోయిన 23 మంది కార్మికుల కోసం ఐదేళ్ల సుదీర్ఘ పోరాటం చేసి కోర్టు ద్వారా న్యాయం ఇప్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రస్తుత కంపెనీ అవసరాల నిమిత్తం అండర్‌గ్రౌండ్ నుండి సర్ఫేస్‌కు వచ్చిన కేటగిరీ కార్మికులు, జనరల్ అసిస్టెంట్లు కూడా కోర్టును ఆశ్రయించి నష్టపోయిన జీతాలను పొందే అవకాశం ఉందని, దీనిని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ హెచ్చరిక.



## వేములవాడ బస్ స్టేషన్ ఆధునీకరణకు మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జూలై 30**

అనంతరం వేములవాడ కోరుట్ల మీదుగా బాసర కు ఎక్స్ ప్రెస్ బస్సును ప్రారంభించడం జరిగింది తదనంతరం ఆర్టీసీ అభివృద్ధిపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ , మేడిపల్లి సత్యం , సంజయ్ కుమార్ , మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జిల్లా కలెక్టర్ గరీమా అగర్వాల్ గార్లు, ఎస్పీ, డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ గారు, ఇతర ముఖ్య నేతలు, అధికారులు.

## వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై సిరిసిల్ల అశోక్

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట)జూలై 30**



ఇల్లంతకుంట మండలంలో పరిధిలో ఎడతెరిపి లేని వర్షాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని భారీ వర్షాలు కురుస్తుందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని పిల్లలు, యువకులు చెరువులు, కాలువల దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. అలాగే విద్యుత్ పరికరాలను మరియు పోల్స్ కు దూరంగా ఉండాలి.విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలంచడానికి పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా ఋఅశ్రీ 100/112 కి లేదా స్థానిక గ్రామ పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలని, ఎస్ఐసిరిసిల్ల అశోక్ తెలియజేశారు.

# భారీ వర్షాలపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- రెడ్ అలర్ట్ నేపథ్యంలో వచ్చే 24 గంటలు కీలకం: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**(దుర్గం నగేష్ ,ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 30 :**



జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, రానున్న 24 గంటల పాటు రెడ్ అలర్ట్ కొనసాగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణకు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. గురువారం ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్‌తో కలిసి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాల పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాలోని చెరువుల పరిస్థితిని సాగునీటి శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, గండి పడే అవకాశమున్న చెరువుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. లస్కర్లు, ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. నీటమునిగిన కాజ్‌వేలు, లోతట్టు రహదారులను వెంటనే మూసివేసి ప్రమాదాలు జరగకుండా పోలీసు, రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లకు జరిగిన నష్టాన్ని వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇళ్లు, పశువుల నష్టం వంటి ఘటనలను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధితులకు త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముంపునకు గురైన కుటుంబాలను వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించి ఆహారం, తాగునీరు, వసతి తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. గోదావరి పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని, ప్రజలు నదులు, వాగులు దాటకుండా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ వ్యవస్థలను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని, అత్యవసర సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో గంగయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, మున్సి పల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయాలి

- ఆర్అండ్ఆర్ కాలనీలోకి నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 30 :**



రామగుండం మున్సిపల్ పరిధిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను మరింత వేగవంతం చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్‌తో కలిసి 21వ డివిజన్ వీర్లపల్లి, ఓసీపీ-3 ప్రాంతం, 25వ డివిజన్‌తో పాటు వరద ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద పరిస్థితులు, నీటి నిల్వలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్అండ్ఆర్ కాలనీలోకి వరద నీరు ఇళ్లలోకి చేరకుండా ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలను అమలు చేయాలని ఆదేశించారు. ఓసీపీ-3 ప్రాంతంలో నిలిచిపోయిన వరద నీటిని యంత్రాల సహాయంతో అత్యంత వేగంగా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. నీటి నిల్వల వల్ల ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహాలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని శాఖలశ్రీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని, అవసరమైన చోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సేవల్లో అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, ఆర్ఎఫ్‌సీఎల్ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆగస్టు 4న ఉపాధి మేళా

- 72 ఖాళీల భర్తీకి నిరుద్యోగులకు అవకాశం
- జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 30**



జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆగస్టు 4న జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉపాధి మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ సేవా సంస్థ ఆధ్వర్యంలో మంథని ప్రాంతంలో పనిచేసేందుకు మొత్తం 72 ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈ ఉపాధి మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో నిర్వహణ అధికారి, ఉత్పత్తి నిర్వహణాధికారి, ఉత్పత్తి పర్యవేక్షకులు, పంపిణీ ఇన్‌చార్జిలు, పంపిణీ సిబ్బంది, నిర్వహణ విభాగం ఇన్‌చార్జిలు, నిర్వహణ సిబ్బంది, గిడ్డంగి ఇన్‌చార్జిలు, గిడ్డంగి సిబ్బంది, నాణ్యత నియంత్రణ ఇన్‌చార్జిలు, నాణ్యత నియంత్రణ సిబ్బంది, జూనియర్ నాణ్యత నియంత్రణ సిబ్బంది, వంటవారు, సమాచార సాంకేతిక విభాగం సిబ్బంది, కొనుగోలు విభాగం సిబ్బంది, ఖాతాల విభాగం సిబ్బంది, మానవ వనరుల విభాగం సిబ్బంది పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఈ ఉద్యోగాలకు పదో తరగతి, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, మెకానికల్, ఎలక్ట్రికల్, మార్కెటింగ్, కంప్యూటర్ సైన్స్, ఆహార సాంకేతిక విద్య, హోటల్ నిర్వహణ, ఆతిథ్య నిర్వహణ, ఎంబీఏ విద్యార్హతలు కలిగి, సంబంధిత అనుభవం ఉన్న పురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆగస్టు 4వ తేదీ ఉదయం 11 గంటలకు తమ తాజా జీవిత విశేషాల పత్రం (రెజ్యూమ్), విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులు, ఆధార్ కార్డు ప్రతితో పాటు అనుభవ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుని సమీకృత జిల్లా కలెక్టరేట్ మొదటి అంతస్తులోని గది నంబర్--233లో ఉన్న జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయానికి హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9908674056, 8985336947, 8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు.

## భారీ వర్షాలవల్ల గొల్లపెల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గొల్లపెల్లి ఎస్సై. కృష్ణ సాగర్ రెడ్డి

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) జూలై 30**



జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై. కృష్ణ సాగర్ రెడ్డి.ప్రజలకు సూచించారు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, కల్వర్టులను దాటవద్దని, అత్యవసరమైతే తప్ప ఇంటిలో నుండి బయటకు రావద్దని కోరారు. నీటి ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన వైర్లు, పాత ఇండ్లు.పాత గోడలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా, ఎప్పుడైనా సహాయం అవసరం అనుకుంటే తక్షణమే 100 కు కాల్ చేయాలని ఎస్సై ప్రజలను కోరారు. ప్రజల కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటామని ,ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటామని అన్నారు అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే.పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు

## గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి జైపూర్ ఎస్సై భూమేష్

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల) జూలై 30**




కడెం ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటి విడుదలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో, ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి లక్ష క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉందని జైపూర్ ఎస్సై తెలిపారు. ఈ నేపథ్యంలో గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ముఖ్యంగా చేపలు పట్టేందుకు నదిలోకి వెళ్లేవారు, రైతులు, పశు వులు, గొర్రెలు మేపేందుకు వెళ్లే కాపరులు ఎట్టి పరిస్థితుల్లోనూ నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరించారు. జైపూర్ మండలంలోని ఇందారం, టేకుమట్ల, శెట్ పల్లి , కుందారం, కిష్టాపూర్, బెజ్జాల తదితర గోదావరి దిగువ గ్రామాల ప్రజలకు ఈ విషయాన్ని వెంటనే తెలియజేయాలని కోరారు. సంబంధిత గ్రామాల సర్పంచ్‌లు తమ గ్రామాల్లో డప్పు చాటింపు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాలని పోలీసు శాఖ తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు. వరద నీటి ప్రవాహం పూర్తిగా తగ్గే వరకు ఎవరూ నిర్లక్ష్యంగా నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, ప్రాణ భద్రతే ముఖ్యమని ఎస్సై ప్రజలకు పిలుపునిచ్చారు.



## భీమన్న సన్నిధిలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 30.**

వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం రాష్ట్ర మంత్రులతో జగిత్యాల ఎమ్మెల్యే దాకటర్ డాక్టర్ సంజయ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది రాష్ట్ర మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్,ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, జగిత్యాల ఎమ్మెల్యే ఎస్పీ మహేష్ బి గితే స్వామి వారిని దర్శించుకొని పూజలు చేయడం జరిగింది ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్రంలో సమృద్ధి వర్షాలు కురవాలని, పాడి పంటలు పండాలని ప్రజలంతా ఆయు ఆరోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేయడం జరిగింది.

## డ్రైనేజీ మురుగునీటిలో మునిగిన ముత్యాల పోచమ్మ ఆలయం..

- అధికారులు మేల్కొనేందెప్పుడు?
- ఆలయ పవిత్రతకు భంగం – భక్తుల అవస్థలు
- ప్రజారోగ్యానికి ముప్పు..
- వెంటనే శాశ్వత డ్రైనేజీ నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్

**( కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్ )జూలై 30**



జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండల కేంద్రంలోని ముత్యాల పోచమ్మ ఆలయంతో పాటు శ్రీ కాలభైరవ సహిత స్వయంభు అష్టభుజ దుర్గాదేవి ఆలయం ప్రతి వర్షాకాలంలో డ్రైనేజీ, వర్షపు నీటిలో మునిగిపోతూ తీవ్ర దుస్థితిని ఎదుర్కొంటోంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు, మురుగు నీరు ఆలయ ప్రాంగణంలోకి చేరి నిల్వ ఉండటంతో భక్తులు దర్శనానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పవిత్ర ఆలయ ప్రాంగణం మురుగు నీటితో నిండిపోవడం వల్ల ఆలయ పవిత్రతకు భంగం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ పరిసరాల్లో రోజుల తరబడి నిల్వ ఉండే డ్రైనేజీ నీటి కారణంగా దోమలు అధికంగా పెరిగి, టైఫాయిడ్, మలేరియా, వైరల్ ఫీవర్ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏడాది వర్షాకాలం రాగానే ఇదే సమస్య పునరావృతమవుతున్నప్పటికీ, ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు విమర్శిస్తున్నారు. ఈ సమస్యను పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా డ్రైనేజీ నిర్మాణంపై స్పష్టమైన చర్యలు కనిపించలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయాన్ని సందర్శించే భక్తుల ఇబ్బందులను, ప్రజారోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి వర్షపు నీరు, మురుగు నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు, సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి శాశ్వత డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించాలి. భక్తుల విశ్వాసాన్ని, ఆలయ పవిత్రతను, ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు ఇకనైనా ఆలస్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు,భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.




## ప్రజా ఉద్యమాలకు కళాకారులూ గళంతో చేయూతనందించాలి

ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి పాటల శిక్షణ తరగతులు

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి)జులై 30**

గార్ల: కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న సంస్కృతిక రంగాల్లో మత ఉన్మాద భావజలానికి వ్యతిరేకశీగా జరిగే ఉద్యమం లో కళాకారులూ గళం తో చేయూత ను అందించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు.స్థానిక వర్తక సంఘం భవనంలో జరుగుతున్న ప్రజా నాట్య మండలి రాష్ట్ర స్థాయి మూడు రోజుల శిక్షణ తరగతులు గురువారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నక్క సైదులు అధ్యక్షతన జరిగిన ముగింపు తరగతులలో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలు, రైతులు, కార్మికులు, సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల వర్గ ఆలోచన తో కూడిన వర్గ పోరాటాలు నిర్వహిశీచడం లో ప్రజా నాట్య మండలి ముఖ్య భూమిక పోషిస్తుందని అన్నారు. మతోన్మాద విధానలపై జరపానున్న వర్గ పోరాటాలలో కళాకారులు ప్రధాన అస్రంగా ఉపయోగ పడాలని అన్నారు. దశాబ్దాల కాలంగా నిర్వహిస్తున్న ప్రజా ఉద్యమాలకు ప్రజానాట్యమండలి అండగా నిలుస్తుందని భవిష్యత్తులోనూ ఈ స్ఫూర్తిని కొనసాగించి, నూతన సంస్కృతిక విప్లవానికి నాంది పలకాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు, సీనియర్ కళాకారుడు అలవాల రామకృష్ణను శాలువను కప్పి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి రాష్ట్ర ప్రముఖ గాయకుడు ఏ జగన్,ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఎంజే వినోద్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కట్ట నరసింహ, రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల ఆనంద్, కాకం ఆంజనేయులు, రాష్ట్ర సహాయ కార్యదర్శిలు కొండూరు భాస్కర్,కుమ్మరి శంకర్,రాష్ట్ర నాయకులు ముత్యాలు,మేడి అంజమ్మ, హరిత, బి.వీరాస్వామి,,మండల నాయకులు సిహెచ్ ఎల్లయ్య, వెంకన్న, ఎస్ నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టి వెంకన్న,కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి,డోర్నకల్ సిఐటియు మండల కార్యదర్శి దాసరి మల్లేశం,తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాల నేపథ్యంలో యామాపూర్-ఫకీర్ కొండాపూర్ గ్రామాల వాగును పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి

- భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 30.**

గురువారం భారీ వర్షాల కారణంగా ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్--ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగును జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు.వాగులో ప్రవాహ పరిస్థితులను పరిశీలించి ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల కారణంగా వాగుల ప్రవాహం ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు.లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, అదేవిధంగా నది ప్రవాహ ప్రాంతాలను చూడడానికి ప్రజలు రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ కు వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ పరిశీలనలో మెట్ పెల్లి డిఎస్పీ రాములు, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత శాఖల అధికారులు, రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



## రహదారులు భద్రమేనా.? కల్వర్టులు ఉన్నా నిరూపయోగమేనా..?

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట)జూలై 30**

పెద్దలింగాపూర్ నుండి అనంతగిరి సిరికొండ,తెనుగువానిపల్లె,మేళ్లచెరువు నాలుగు గ్రామాలకువెళ్లే రహదారి వనపడితే గుంతల మాయం నీరుపోవడానికి కల్వర్ట్ లు ఉన్నా పొలాల నుండి వచ్చే నీరు రహదారులపై పారడం తో దానికి తోడుగా రైల్వే లైనుల పని కోసం నడుస్తున్న భారీ వాహనాలతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో చిన్నవాహనాలకు ఇబ్బంకరంగా గుంతలు చెరువులుగా తలపిస్తున్నాయి అందువల్ల అనంతగిరి పోచమ్మ దేవాలయానికి వచ్చే ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని దర్శనాలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది క్రింది సంవత్సరంలో కొందరు వృద్ధ దంపతులకు పడిపోయిన సంఘటనలు కూడఉన్నాయి పెద్దలింగాపూర్ అనంతగిరి రహదారిని డబుల్ లైన్ రహదారిగా మార్చితే వచ్చిపోయే ప్రయాణికులకు పోచమ్మ టెంపుల్ కు వచ్చే భక్తులు రవాణా సమస్యలు లేకుండా ప్రయాణం సాఫిగా సాగుతుందని కోరుతున్నారు



# జలమయమైన లోతట్టు ప్రాంతాలకు స్పందన

- మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలు
- గొల్లపెల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మార్వో మాజీ దు

**(కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్ )జూలై30**

జగిత్యాల జిల్లా గొల్లపెల్లి మండలంలో మంగళవారం రాత్రి నుండి గురువారం వరకు ఎడతెరిపి లేని వాన కురిసింది. మండలంలోని బొంకూరు గ్రామంలోని లో లెవెల్ వంతెన మునిగి రాకపోకలు స్తంభించిపోయాయి. 82.4మి. మీ కురిసిన వర్షం దాటికి మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమల జలమయమయ్యాయి. చెరువు మత్తళ్లు పొంగిపొర్లుతున్నాయి. గొల్లపెల్లి మండల కేంద్రంలోని బెస్తపల్లి 11వ వార్డులో ఇండ్లలోకి నీరు చేరడంతో బృందామయంగా మారింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాపల్లి గంగన్న తో పాటు తాసిల్దార్ మాజీ ద్, ఎంపీడీవో రవీందర్రావు, ఆర్ ఐ ఎడ్ల జీవన్, ఉప సర్పంచ్ గురిజాల బుచ్చిరెడ్డి పరిశీలించారు.



# విలోచవరం వాగు ఉప్పొంగడంతో మంథనికి రాకపోకలు నిలిచివేత

**మంథని, జూలై-30 (ప్రజాతీర్పు)**

మంథని మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా విలోచవరం వాగు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తోంది. వాగు ఉద్ధృతి ఒక్కసారిగా పెరగడంతో రహదారిపై భారీగా వరద నీరు చేరి, విలోచవరం నుండి మంథనికి వెళ్లే వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగు ప్రవాహం తీవ్రంగా ఉండటంతో అధికారులు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగును దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరిస్తున్నారు. రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, నీటి మట్టం తగ్గిన తర్వాత మాత్రమే రాకపోకలను పునరుద్ధరిస్తామని తెలిపారు.



# సీనియర్ గౌడ సంఘం నాయకుడు సట్ల యాదగిరి గౌడ్ కు నివాళులు

**నర్సంపేట టౌన్ జులై 30 ప్రజా తీర్పు**

వర్దన్నపేట నియోజకవర్గం ఇల్లంద గ్రామానికి చెందిన సీనియర్ గౌడ సంఘం నాయకు డు సట్ల యాదగిరి గౌడ్ గుండె పోటు తో స్వర్గస్తులయ్యారు. యాదగిరి గౌడ్ అంతక్రియలు గురువారం ఇల్లందలో జరిగాయి.ఈ అంతక్రియల కార్యక్రమం లో గౌడ జన హక్కుల పోరాట సమితి మొక్కుబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ గౌడ్, వరంగల్ జిఎచ్ఎంసి 41 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పోశాల పద్మ -స్వామి గౌడ్, మోడెం యాదగిరి గౌడ్, మోడెం బీక్షపతి గౌడ్, మోడెం రాజయ్య గౌడ్,సట్ల సూరయ్య గౌడ్, మోడెం రమేష్ గౌడ్, సట్ల స్వామి గౌడ్, మోడెం స్వామి గౌడ్,మాజీ కార్పొరేటర్ నాగపూరి సంజయ్ గౌడ్,విలాసాగరం రాజేష్ గౌడ్, వర్దన్న పేట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోశాల వెంకట్ గౌడ్,మడ్డిస్వామి గౌడ్, శ్రీనివాస్ గౌడ్,గడ్డంనాగరాజుగౌడ్,కుమార్ గౌడ్,రంజిత్ గౌడ్,మోడెం నాగ రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# పంట పొలంలో చేరిన సిమెంట్ ఇటుకలు.. సాగుకు పనికిరాకుండా మారిన భూమి

**మంథని, జూలై-30 (ప్రజాతీర్పు)**

మంథని మండలం గుమ్మునూర్ గ్రామపంచాయితీ పరిధిలోని దంతలపల్లిలో ఉన్న కొంజెర్ల ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఏఏసి బ్లాక్ తయారీ పరిశ్రమ కాంపౌండ్ గోడ కురిసిన భారీ వర్షాలకు కూలిపోవడంతో పెద్ద ఎత్తున సిమెంట్ ఇటుకలు రైతు నల్లి లక్ష్మయ్యకు చెందిన సర్వే నంబర్ 49/బి లోని 38 గుంటల పట్టా భూమితో పాటు కౌలుకు సాగు చేస్తున్న పొలాలు కూడా సిమెంట్ ఇటుకలతో నిండిపోయాయి. సాగుకు సిద్ధం చేసిన భూమి, నారుమళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పరిశ్రమ యాజమాన్యానికి తెలియజేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన ఆరోపించారు. వరదతో పొలాల్లోకి చేరిన సిమెంట్ ఇటుకలను వెంటనే తొలగించి, పంట నష్టానికి తగిన పరిహారం అందించాలని రైతు డిమాండ్ చేశారు. సంబంధిత రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించి న్యాయం చేయాలని నల్లి లక్ష్మయ్య విజ్ఞప్తి చేశారు.

# లిఫ్టుల రక్షణ రైతు బాధ్యత..

- దొంగతనాలకు చెక్ పెడదాం
- సూర్యాపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు
- హాజరైన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పీ నరసింహా, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 30**



వ్యవసాయానికి ప్రాణాధారమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణ, భద్రతతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల దొంగతనాల నివారణే ధ్యేయంగా సూర్యాపేట జిల్లా పోలీసు యంత్రాంగం ముందడుగు వేసింది. హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని రైతులు, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ అధికారులతో కలిసి హుజూర్ నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

### రైతు కమిటీలు వేసి పర్యవేక్షించాలి: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, వైర్లు, ఆయిల్ దొంగతనానికి గురైతే చివరకు తీవ్రంగా నష్టపోయేది రైతాంగమేనని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆవేదన వ్యక్తం చేశారు. దొంగతనాలు జరిగాక పోలీసులు ఇతర రాష్ట్రాలకు వెళ్లి నిందితులను పట్టుకొని సొత్తు రికవరీ చేస్తున్నారని, అయితే దొంగతనాలు జరగకుండా ముందస్తుగా అడ్డుకోవడమే ముఖ్యమని స్పష్టం చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి లిఫ్ట్ పరిధిలో రైతులు సహకార సొసైటీలు, కమిటీలుగా ఏర్పడి నిరంతరం పర్యవేక్షించుకోవాలని సూచించారు. రైతుల కమిటీల ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం, ఇరిగేషన్ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. లిఫ్టుల వద్ద తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున, రైతులు నీటిని ఆదా చేస్తూ తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

### రైతులకు పోలీసుల అండ.. పెట్రోలింగ్ ముమ్మరం: ఎస్పీ నరసింహ

దేశానికి వెన్నుముక అయిన రైతన్నలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న లిఫ్ట్ పథకాలనే లక్ష్యంగా చేసుకుని దొంగలు వైర్లు, ఆయిల్, ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్తున్నారని తెలిపారు. రైతుల మధ్య ఐకమత్యం, సామాజిక బాధ్యత పెరిగినప్పుడే దొంగతనాలకు చెక్ పెట్టవచ్చన్నారు. పోలీసు శాఖ తరఫున లిఫ్టుల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసి, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. దొంగతనాల నిర్మూలనలో రైతులు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.

### లిఫ్టులను సొంత ఆస్తిగా భావించాలి: ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి

ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్లను రైతులు తమ సొంత ఆస్తిగా భావించి రక్షించుకోవాలని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి కోరారు. లిఫ్టులలో దొంగతనాలు జరిగితే సాగునీరు అందక రైతులే నష్టపోతారని అన్నారు. వ్యవసాయ రంగానికి నిరంతర నీరందించేందుకు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అనుక్షణం కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం, దొంగతనాల నివారణే ధ్యేయంగా ఇన్ని శాఖలను ఒకే వేదికపైకి తెచ్చి భారీ అవగాహన సదస్సు నిర్వహించిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని, ఎస్పీ నరసింహను ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి సూర్యనారాయణ, ఇరిగేషన్ సిఇ నాగభూషణం, విద్యుత్ డిఇ రామ్మోహన్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత ఇరిగేషన్, వ్యవసాయ శాఖల అధికారులు, హుజూర్ నగర్, కోదాడ నియోజకవర్గాల పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, రెండు నియోజకవర్గాల పరిధిలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బారీవర్షాల నేపథ్యంలో అవసరమైతే తప్ప బయటికి రావద్దు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా :

**(అరికిల్ల జయకుమార్ ప్రజా తీర్పు మంచిర్యాల) జూలై 30**



అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి

గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పెద్దపల్లి,మంచిర్యాల జోన్లలోని పోలీసు యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఎవరైనా ఆపదలో చిక్కుకున్నట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించి పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు. అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీసు శాఖ తరఫున అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.ప్రజలు పోలీసుల సూచనలు, సలహాలను పాటిస్తూ సహకరించాలని, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు,కాలువలు, నదులు, రిజర్వాయర్లు, చెరువుల వద్దకు వెళ్ల రాదని. చెట్ల కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో లేదా పాడైన నిర్మాణాల వద్ద ఆశ్రయం పొందరాదు. విద్యుత్ స్థంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు తాకరాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువులు,నాలాలు, డ్యామ్‌లు, జలపాతాలు (వాటర్ ఫాల్స్) వద్దకు వెళ్లరాదు.చేపల వేట కోసం కూడా వెళ్లకూడదు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ఇంటి నుంచి బయటకు రావాలి. స్థానిక రెవెన్యూ, నీటిపారుదల, పంచాయతీరాజ్, విద్యుత్,ఆర్అండ్‌బీ, వైద్య శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ,వరదల కారణంగా రహదారులు దెబ్బతిన్న లేదా నీట మునిగిన ప్రాంతాల్లో ప్రజలు వెళ్లకుండా ఇరువైపులా బ్యారికేడ్లు,ప్లాస్టిక్ కోన్‌లు,హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెరువులు, కుంటలు,అలుగులు, ప్రధానరహదారులపై ప్రవహిస్తున్న వాగులు, వంకల వద్ద నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పోలీసు అధికారులు,సిబ్బంది అన్ని జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వరద నీటి కారణంగా చెరువులు, కుంటలు నిండి కట్టలు తెగిపోయే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రయాణించాలి. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, గుంతలు ఏర్పడి వాటిలో నీరు నిల్వ ఉండడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది.కాబట్టి నెమ్మదిగా, అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు. కల్వర్టులు,చిన్న వంతెనలపై నీరు ప్రవహిస్తున్న సమయంలో వాహనాలతో వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని హెచ్చరించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు, కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక శిక్షణ పొందిన 30 మంది సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్-100కు సమాచారం జత సిద్ధంగా ఉంటారని పోలీస్ కమిషనర్ తెలిపారు.



# ఓటర్ జాబితా ప్రక్రియ రెండు రోజుల్లో ముగియనున్నది

- నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి పాల్గొన్న బుర్రి సాగర్ ఆల్ రాజకీయ పార్టీ ప్రతినిధులు

**నర్సంపేట టౌన్ జూలై 30 ప్రజా తీర్పు**

నర్సంపేట ఆర్డీవో ప్రతి వారం ఓటర్ జాబితా ప్రక్రియపై ఆల్ రాజకీయ పార్టీ ప్రతినిధులతో మరియు అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేసి తగు సూచనలు సలహాలు ఇస్తూ ఏ ఒక్కరి ఓటు మిస్ కాకుండా చూడాలని మీటింగ్ ఏర్పాటు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే కావున వచ్చే నెల రెండో తారీకు వరకు లాస్ట్ డేట్. ఓటర్ జాబితా ప్రక్రియ ముగియనందున ఈరోజు ఆల్ రాజకీయ పార్టీలను పిలిపించి మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ మీటింగ్ లో ఆల్ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనడం జరిగింది.

# ఇక రంగంలోకి జెన్ ఆల్ఫా!.. జెన్ జీ స్ఫూర్తితో నిరసనలు

కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జెన్-జీ చేసిన ఆందోళన విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర రాజీనామాతో తాత్కాలికంగా సద్దుమణిగినప్పటికీ ఆ ఉద్యమ స్ఫూర్తి, పోరాట పటిమ పలు రంగాల వారిలో చైతన్య జ్వాలను రగిలించింది. 'పోరాడితే పోయేదేమి లేదు.. సమస్యల పరిష్కారం తప్ప' అన్న నినాదంతో సమస్యలపై నిరసన గళమే శరణ్యమన్న దృఢ నిశ్చయానికి వచ్చి వారు తమ కార్యాచరణను ప్రారంభిస్తున్నారు. ఈ క్రమంలో జెన్ ఆల్ఫా తరం జరుపుతున్న ఆందోళన ఇప్పుడిప్పుడే అన్ని ప్రాంతాలకు వ్యాపిస్తున్నది. 2010-2024 మధ్య పుట్టిన వారిని జెన్-అల్ఫాగా పేర్కొంటున్నారు. అంటే వీరంతా 14 ఏండ్ల లోపు వారే. అయితే వీరు సైతం తమ సమస్యలపై బైఠాయింపులు, ధర్నాలు జరుపుతుండటం దేశంలో కొత్త పరిణామం. ముఖ్యంగా పాఠశాలల విద్యార్థులు తమ హక్కులు, నాణ్యవంతమైన విద్య, సౌకర్యాల కోసం గళం విప్పి యంత్రాంగాన్ని నిలదీస్తున్నారు.

# హుస్నాబాదులో నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్ ప్రారంభించిన సీపీ రష్మీ పెరుమాళ్

**సిద్దిపేట జిల్లా హుస్నాబాద్**
**జులై 30 రవీందర్ ప్రజా తీర్పు**




హుస్నాబాద్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను కమిషనర్ ఆఫ్ పోలీస్ రష్మీ పెరుమాళ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ రిబ్బన్ కత్తిరించి అవుట్‌పోస్ట్‌ను అధికారికంగా ప్రారంభించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీపీ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ... హుస్నాబాద్ పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులను నివారించడానికి, ప్రజల సౌకర్యార్థం నూతన ట్రాఫిక్ అవుట్‌పోస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవుట్‌పోస్ట్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చి, విధులు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. గతంలో ట్రాఫిక్ విభాగం కొరకు ప్రత్యేక స్థలం లేకపోవడం వల్ల కొంత ఇబ్బంది ఉండేదని, ఇప్పుడు పూర్తిస్థాయిలో అవుట్‌పోస్ట్ అందుబాటులోకి వచ్చినందున ట్రాఫిక్ క్రమబద్ధీకరణను మరింత బలోపేతం చేసేందుకు ఇక్కడికి అదనపు సిబ్బందిని కూడా త్వరలోనే కేటాయిస్తామని సీపీ స్పష్టం చేశారు.పట్టణ ప్రజలు, వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా ప్రమాణాలు మరియు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సీపీ విజ్ఞప్తి చేశారు. ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా అనుసరించాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, హుస్నాబాద్ ఏసిపి సదానందం, హుస్నాబాద్ సీఐ శ్రీధర్ , చేర్యాల సీఐ రమేష్, ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, డివిజన్ పీఎస్ హుస్నాబాద్ ఎస్ఐ లక్ష్మారెడ్డి, కోహెడ ఎస్సై అభిలాష్, కొమురవెల్లి ఎస్ఐ మహేష్, అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు
- ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- 24 గంటలు కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేయాలి
- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ సహాయక చర్యలను వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

**(అనంతుల శ్రీనివాస్ గౌడ్, ప్రజా తీర్పు సూర్యాపేట జిల్లా ప్రతినిధి) జూలై 30**



రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి భారీ వర్షాలు, వరద పరిస్థితులపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన సహాయక చర్యలను వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అధికారులందరూ తమ తమ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని, అన్ని జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాల్లో నమోదైన వర్షపాతం, జలాశయాల్లో నీటి నిల్వలు, దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, చేపట్టిన సహాయక చర్యలపై జిల్లా యంత్రాంగాన్ని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొంటూ, ఎక్కడైనా ప్రజలకు ఇబ్బందులు ఎదురైనట్లు సమాచారం అందితే వెంటనే స్పందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు టామ్‌టామ్ నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్య పనులను నిరంతరం కొనసాగించాలని, వైద్యారోగ్య శాఖ అధికారులు అత్యవసర సేవలకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలకు ప్రజలు, పశుకాపరులు, మత్స్యకారులు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తోందని తెలిపారు. అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవిన్యూ అధికారి ప్రేమ్ రాజ్, రెవెన్యూ డివిజనల్ అధికారి వేణు మాధవ్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, జిల్లా ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి యాదగిరి, జిల్లా మత్యశాఖ అధికారి ఆంజనేయస్వామి, జిల్లా హార్టికల్చర్ అధికారి నాగయ్య, డిసిహెచ్ఎస్ అధికారి చంద్ర శేఖర్, జిల్లా ఫైర్ అధికారి కృష్ణ రెడ్డి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## వేములవాడ బుడగ జంగాల కాలనీలో 30 కుటుంబాలను ప్రజలకు హరిమల గార్డెన్‌లో పునరావాసం: మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

- బుడగ జంగాల కాలనీని పరిశీలించిన చైర్మన్, ఆర్డీఓ, డీఎస్పీ, కమిషనర్
- ఆపద వస్తే వెంటనే సమాచారం ఇవ్వండి: చైర్మన్ పుల్కం రాజు

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జూలై 30**



గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వేములవాడ పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. ముఖ్యంగా 13వ వార్డు పరిధిలోని కొనాయిపల్లి రోడ్డులో ఉన్న బుడగ జంగాల కాలనీని వర్ద నీరు చుట్టుముట్టడంతో కాలనీ పూర్తిగా జలమయమైంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధితులను కాపాడేందుకు మున్సిపల్ యంత్రాంగం తక్షణమే రంగంలోకి దిగింది. వరద ముప్పు పెరిగే ప్రమాదం ఉండటంతో ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా దాదాపు 30 కుటుంబాలను మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో సురక్షిత ప్రాంతానికి తరలించారు. తాత్కాలిక పునరావాస కేంద్రమైన హరిమల గార్డెన్‌కు తరలించి ప్రాథమిక వసతులను కల్పించారు. అయితే ?పరిస్థితిని తెలుసుకున్న వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌లతో కలిసి జలమయమైన 13వ వార్డు కాలనీ ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం హరిమల గార్డెన్‌లోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి బాధితులకు కల్పిస్తున్న ఏర్పాట్లను సమీక్షించారు. వర్షాల ఉద్ధృతి దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రాణనష్టం జరగకుండా ఉండేందుకే కాలనీవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పుల్కం రాజు పేర్కొన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ప్రతికూల వాతావరణంలో అధికారులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని ధైర్యాన్నిచ్చారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా ప్రమాదం ఎదురైతే తక్షణమే మున్సిపల్ సిబ్బందికి లేదా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్, తహసిల్దార్ జయంత్, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, టిబిపిఓ వినోద్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ సుకుమార్, మున్సిపల్, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..



## లక్నవరం సరస్సులోకి భారీగా వరదనీరు.. 21 అడుగులకు చేరిన నీటిమట్టం

**(ములుగు జిల్లా ప్రజా తీర్పు ప్రతి నిధి వెంకట్ ) జూలై 30**

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం లక్నవరం సరస్సు వర్షాలతో జలకళను సంతరించుకుంది. గత కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో సరస్సులోకి వరదనీరు భారీగా చేరుతోంది. దీంతో సరస్సు నీటిమట్టం క్రమంగా పెరుగుతూ ప్రస్తుతం 21 అడుగులకు చేరింది. గురువారం నాటికి 19.6 అడుగులుగా ఉన్న నీటిమట్టం, వరద ప్రవాహం కారణంగా వేగంగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. వర్షాలు ఇదే విధంగా కొనసాగితే సరస్సు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పరిస్థితిని ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నారు. లక్నవరం సరస్సు రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక ప్రాంతం కావడంతో వర్షాకాలంలో సందర్శకుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉంది. అయితే వరద ఉద్ధృతి నేపథ్యంలో పర్యాటకులు, స్థానికులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. సరస్సు వద్ద సెల్ఫీల కోసం ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లవద్దని, నీటిలోకి దిగడం, ఈత కొట్టడం, పడవ ప్రయాణాలు అధికారుల అనుమతి లేకుండా చేపట్టవద్దని హెచ్చరించారు. ఖరీఫ్ సాగుకు లక్నవరం సరస్సు కీలక జలవనరుగా ఉండటంతో రైతులు నీటిమట్టం పెరుగుతుండటంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది.

## పరిణతితో ఆలోచిస్తున్నా!

**శృతిహాసన్ నటిగా మారి 17ఏండ్లయింది. సోహన్‌షా దర్శకత్వంలో 2009లో వచ్చిన బాలీవుడ్ సినిమా 'లక్' నటిగా ఆమె తొలి సినిమా. ఆ తర్వాత అదే ఏడాది తెలుగులో 'అనగనగా ఒక ధీరుడు'లో నటించారు శృతిహాసన్. రెండూ పెద్దగా ఆడలేదు. తెలుగులో వచ్చిన 'గబ్బర్‌సింగ్' ఆమెకు తొలి హిట్. ఇక అప్పట్నుంచి వెనక్కు తిరిగి చూసుకునే అవసరం రాలేదు శృతిహాసన్‌కి.**





## నన్నే నన్నే మనిషిగా గుర్తించావే..

హీరో శ్రీరామ్ నటిస్తున్న సైకలాజికల్ థ్రిల్లర్ 'ది మేజ్'. ప్రియాంక, ప్రీతిక శ్రీనివాస్, కమల్ కామరాజు కీలక పాత్రధారులు. డాక్టర్ రవికిరణ్ గడలాయ్ దర్శకుడు. డాక్టర్ ఉదయ్ కె.రెడ్డి పాల్వాయి, డాక్టర్ కరెడ్డి శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ భరత్‌రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్‌రెడ్డి సోమ నిర్మాతలు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ జరుపుకుంటున్నది. మ్యూజిక్ ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమాలోని తొలి పాటను హీరో ఆనంద్ దేవరకొండ విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'నన్నే నన్నే మనిషిగా గుర్తించావే.. నన్నే నన్నే మార్చేశావే.. మన్ను మిన్ను కలిపేలా పైవాడే.. నన్నూ నిన్నూ కలిపాడే' అంటూ సాగే ఈ పాటను విజయ్‌కుమార్ రాయగా, శ్రవణ్ భరద్వాజ్ స్వరపరిచారు. కపిల్ కపిలన్ ఆలపించారు.



## ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

- సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్
- వార్షిక తనిఖీల్లో భాగంగా ఏసీపీ కార్యాలయం తనిఖీ

**సిద్దిపేట్ జిల్లా హుస్నాబాద్ జులై 30 రవీందర్ ప్రజా తీర్పు**

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సిద్ధిపేట సీపీ రష్మీ పెరుమాళ్ అన్నారు.వార్షిక తనిఖీల్లో భాగంగా సిద్దిపేట కమీషనర్ ఆఫ్ పోలీస్ రష్మి పెరుమాళ్ గురువారం హుస్నాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న కమిషనర్‌కు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఆమె కార్యాలయ ఆవరణలో పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ మొక్కను నాటారు. అనంతరం సీపీ రష్మీ పెరుమాళ్ కార్యాలయ పరిసరాలను పరిశీలించి, పోలీస్ స్టేషన్‌లోని అన్ని రకాల రికార్డులను మరియు ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసుల వివరాలను నిశితంగా తనిఖీ చేశారు.ఏసీపీ సదానందం కు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు: ఎస్సీ,ఎస్టీ, పోక్సో మరియు ఇతర గ్రేవ్ కేసుల దర్యాప్తును నిర్ణీత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కార్యాలయానికి సంబంధించిన అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ, పారదర్శకంగా ఉంచాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో ఓపికగా మాట్లాడి, వారి సమస్యలను వినాలని అధికారులకు సూచించారు. బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, వాటికి త్వరగా పరిష్కారం లభించేలా చొరవ చూపాలని స్పష్టం చేశారు. సిద్దిపేట సురక్ష నేత్ర కార్యక్రమంలో భాగంగా డివిజన్ లోని అన్ని గ్రామాలలో సీసీటీవీ కెమెరాలను అమర్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. సిద్దిపేట పోలీస్ ఉద్యోగమిత్ర పోర్టల్ గురించి అన్ని గ్రామాలలో యువతకు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు.ఈ తనిఖీ కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సదానందంతో పాటు హుస్నాబాద్ సీఐ శ్రీధర్, చేర్యాల సీఐ రమేష్, కొముురవెల్లి ఎస్సై మహేష్, హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి, అక్కన్నపేట ఎస్సై ప్రశాంత్, కోహెడ ఎస్సై అభిలాష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వెంకటేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు


భక్తులు సమర్పించిన కానుకల ఆదాయం రూ. 1,92,184

**హుస్నాబాద్ జులై 30 రవీందర్ ప్రజా తీర్పు**

చిగురుమామిడి మండలం సుందరగిరి పవిత్ర క్షేత్రమైన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపును గురువారం ఆలయ అధికారులు నిర్వహించారు.గత 10నెలలుగా భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను ఆలయ అధికారులు,అర్చకులు,సిబ్బంది సమక్షంలో లెక్కించారు.ఈ లెక్కింపులో స్వామి వారికి మొత్తం రూ. 1,92,184.00 (ఒక లక్షా తొంభై రెండు వేల నూట ఎనభై నాలుగు రూపాయలు) నగదు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ కొండపర్తి రాజ్ కుమార్ తెలిపారు.భక్తులు తమ మొక్కుబడుల రూపంలో నగదుతో పాటు పలు రకాల కానుకలను హుండీలో సమర్పించారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ దేవదాయ శాఖ జూనియర్ అసిస్టెంట్ సహాయ కమిషనర్ శ్రీనివాస్,ఆలయ అర్చకులు శేషం నవీన్ ఆచార్యులు,హుస్నాబాద్ శ్రీ గోమాత సేవాసమితి సభ్యులు,కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రామన్నగూడెం వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

**(వెంకట్ ములుగు జిల్లా ప్రజా తీర్పు న్యూస్ ప్రతినిధి ) జూలై 30**



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదావరి నది వరద ఉద్ధృతి క్రమంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం వరకు నీటిమట్టం 11.76 మీటర్లకు చేరినట్లు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నది ప్రవాహం వేగంగా కొనసాగుతుండటంతో అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. రాత్రి వేళల్లో నీటిమట్టం మరింత పెరిగే అవకాశం ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. నీటిమట్టం 14.82 మీటర్లకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక (ఖీఱతీర్ ఔుతీఅఱఅస్త్ర) జారీ చేసే అవకాశముందని అధికారులు వెల్లడించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు, గోదావరి తీర గ్రామాల ప్రజలు, మత్స్యకారులు, పశువుల కాపరులు నదికి సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే స్థానిక అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని, వరద పరిస్థితులపై జిల్లా యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచిందని తెలిపారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే రెవెన్యూ, పోలీసు, విపత్తు నిర్వహణ శాఖ అధికారులకు సమాచారం అందించాలని, ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020